
గిద్దలూరు నుంచి మహానాడుకు బయలుదేరిన కార్యకర్తలు

తండోపతండాలుగా..

పసుపు జెండాలతో బస్సులు, కార్లు... మెడలో పచ్చ కండువాలతో, చేతిలో టీడీపీ జెండాలతో తెలుగు తమ్ముళ్లు కడప బాట పట్టడంతో జిల్లాలో ప్రధాన రహదారులన్నీ కోలాహలంగా మారాయి. ప్రధానంగా పశ్చిమ ప్రాంతం నుంచి పార్టీ శ్రేణులు తండోపతండాలుగా తరలి వెళ్లాయి. కడపలో జరిగే టీడీపీ మహానాడు చివరిరోజు బహిరంగసభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా కదిలి వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు కూడా అదే ఉత్సాహంతో సంబరాలు చేసుకుంటూ రావడంతో రోడ్లన్నీ పసుపుమయం అయ్యాయి.

కడప సభకు జిల్లా నుంచి భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

- పశ్చిమ ప్రాంతం నుంచే అధికం
- మూడ్రోజులు ఉత్సాహంగా మహానాడులో పాల్గొన్న నాయకులు
- రహదారుల వెంబడి పసుపు జెండాల రెపరెపలు
- ఆ దారి వెంటే పొరుగు జిల్లాకు వాహనాలు


పామూరు నుంచి మహానాడుకు కదిలిన కార్యకర్తలు

ఒంగోలు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉదయం ఆరు గంటల నుంచే జిల్లాలోని గ్రామాలు, పట్టణాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ, ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల్లో తెలుగు తమ్ముళ్లు మెడలో పసుపు కండువాలు వేసుకొని జెండాలు చేతబట్టి మహానాడుకు బయలు దేరారు. కనిగిరి నియోజకవర్గ పరిధిలోని పామూరు, గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు, కొమరోలు నుంచి కడపకు వెళ్లే మార్గాలన్నీ పసుపుమయం అయ్యాయి. జిల్లా నుంచి సుమారు పాతికవేల మంది వరకు తెలుగుదేశం శ్రేణులు కడప సభకు వెళ్లినట్లు పార్టీ వర్గాల సమాచారం. 250 ఆర్టీసీ బస్సులు, అంతకు రెట్టింపు సంఖ్యలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులతో పాటు వందలాది కార్లు ఇతర వాహనాల్లో పార్టీ కార్యకర్తలు వెళ్లినట్లు సమాచారం. పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, వైపాలెం, దర్శి నియోజకవర్గాల నుంచి అధికంగానే వెళ్లారు. తూర్పు ప్రాంతంలోని కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలు వెళ్లారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల నేతృత్వంలో ఆయా నియోజకవర్గాల్లో వాహనాల, ఆహారం, నీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాలైన ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీగా టీడీపీ శ్రేణులు మహానాడు ముగింపు సభకు గురువారం తెల్లవారుజాము నుంచి

మిగతా 6లో...


మహానాడు సభా వేదిక వద్ద ఉమ్మడి జిల్లా మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

పారిశ్రామిక పరుగులు

దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అడుగులు

380 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం


దొనకొండలో ఏపీఐఐసీ ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ పార్క్

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఐదువేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికే ప్రకటించారు. తాజాగా పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీ కింద పది భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో దొనకొండలో 380 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమైంది. ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

దొనకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): దొనకొండలో పారిశ్రామల కారిడార్ ఏర్పాటుచేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు దొనకొండ మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, రుద్రసముద్రం, భూమనపల్లి గ్రామాల్లో 2395

మిగతా 6లో...


చెరువుకొమ్ముపాలెంలో బుధవారం రేషన్ షాపులో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

రేషన్ అక్రమాలకు చెక్ పడేనా?

జిల్లాలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లను చకచకా చేస్తోంది. అందుకోసం జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రేషన్ డీలర్లకు సమావేశాలు ఏర్పాటు చేసి బియ్యం పంపిణీపై అవగాహన కల్పించడంతో పాటు దిశానిర్దేశం చేస్తున్నారు. పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకనుగుణంగా చర్యలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అధికార యంత్రాంగం కదిలింది.

డీలర్ల ద్వారా సరుకుల పంపిణీకి ఏర్పాట్లు

- వడివడిగా అడుగులు వేస్తున్న యంత్రాంగం
- ఆన్‌లైన్ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే..

ఒంగోలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ పంపిణీ పేరుతో మొబైల్ వాహనాలు ఏర్పాటు చేసినా ఏనాడు సక్రమంగా వచ్చి రేషన్ పంపిణీ చేసిన పరిస్థితి లేదు. రేషన్ పంపిణీ సమయంలో ఏదో ఒక ప్రాంతంలో వాహనం ఆగితే అక్కడకు వెళ్లి కార్డుదారులు రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ వాహనం ఎప్పుడు వస్తోందోనని తమ పనులు మానుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ జరుగుతున్న పరిస్థితిని అధ్యయనం చేసింది. కార్డుదారులకు సమయానుకూలంగా పంపిణీ చేయడం లేదని నిర్ధారించుకోవడంతో పాటు ప్రభుత్వంపై ఆర్థిక భారం కూడా అధికంగా పడుతుండటంతో వాహనాలను రద్దుచేసి పాత పద్ధతిలోనే రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

సాంకేతికత జోడించి సరుకుల పంపిణీ..

గత నాలుగేళ్ల నుంచి బియ్యం, ఇతర సరుకులు డీలర్ల వద్ద కేవలం స్టాక్ పాయింట్‌గానే ఉండేవి. మొబైల్ వాహనం ఆపరేటర్లు ఆ డీలర్ షాపు నుంచి రేషన్ తమ వాహనాల ద్వారా సంబంధిత ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఈ పద్ధతికి ప్రస్తుత ప్రభుత్వం చెక్ పెట్టింది. జూన్ 1వతేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందుకోసం జిల్లాలో ఉన్న 1392 రేషన్‌షాపులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆ రేషన్ షాపు ఉండే లొకేషన్‌తో పాటు ఆ రేషన్‌షాపు ఉండే గృహం, లోపల ఏ విధంగా ఉంది? తదితర అంశాలతో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఫొటోలు తీసి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ యంత్రాంగం కూడా రేషన్ షాపులను పరిశీలిస్తోంది. ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా రేషన్ షాపులను పరిశీలించి సిబ్బందికి, డీలర్లకు పలు సూచనలు కూడా చేశారు. మరోవైపు డివిజనల్, మండల స్థాయిలో కూడా రేషన్‌షాపుల డీలర్లతో సమావేశాలు నిర్వహించి సరుకుల పంపిణీకి

మిగతా 6లో...

చిట్టడవులయ్యాయి!

దర్శి నియోజకవర్గంలో కాలనీల దుస్థితి ఇదీ!

- అనువైన స్థలాలు కాకపోవటంతో వదిలేస్తున్న లబ్ధిదారులు
- పలుచోట్ల చుట్టూ నీరే
- రూ.50 కోట్లు ప్రజాధనం వృథా


దర్శి జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాల చుట్టూ పెరిగిన చిల్లచెట్లు

దర్శి నియోజవర్గంలో నాటి జగనన్న కాలనీల పథకం అభాసుపాలైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడంబరంగా ఏర్పాటైన ఈ పథకం అమలుతీరులో అవకతవకల వల్ల లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. వాగులు, వంకలు, కుట్టలు తదితర ప్రాంతాల్లో కాలనీలు కేటాయించటంతో స్థలాలు తీసుకున్న లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రాలేదు. ప్లాట్లు రద్దు చేస్తామని అధికారులు బెదిరించినా లెక్క చేయకుండా వదిలేశారు. దీంతో ఈ స్థలాలకు పెట్టిన రూ.50 కోట్ల ప్రజాధనం వృథా అయింది.


బండివెలిగండ్లలో జగనన్న కాలనీ ఇలా..

దర్శి, మే 29 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో సుమారు ఎనిమిది వేల ప్లాట్లు వేశారు. 1589 కాలనీలు మంజూరు చేశారు. అందులో ఇప్పటివరకు 381 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. కొన్ని గృహాలు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలు తమ సొంత స్థలాలకు కాలనీలు మంజూరు చేయించుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు మాత్రం ఇష్టపడటం లేదు. దర్శి పట్టణ ప్రజలకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో చలివేంద్ర కొండవద్ద లేఅవుట్లు వేశారు. అక్కడ కాలనీల అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం సుమారు రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసింది. కేవలం 96 గృహాలు మాత్రమే నిర్మించారు. ఒక లేఅవుట్ ముందు వర్షపు నీరు కుంటలా నిలిచి ఉంది. గతంలో ఆ ప్రాంతం వాగులాగా ఉండటంతో నీటి నిల్వ కోసం చెక్‌డ్యామ్ కట్టించారు. అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకుండా అక్కడ ప్లాట్లు కేటాయించారు. దీంతో ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి ప్రజలు ఇష్టపడటం లేదు.

గ్రామీణ ప్రాంతాల్లో విముఖత

- గ్రామీణ ప్రాంతాల్లో కూడా జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజలు ముందుకు రాలేదు. రాజంపల్లిలో పశువుల మేత పోరంబోకు భూమిలో కాలనీ మంజూరు చేయటంతో గ్రామస్థులు కొందరు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారు. దీంతో అక్కడ కాలనీ ఏర్పాటుకు నోచుకోలేదు. అభివృద్ధి కోసం రూ.54 లక్షలు ఖర్చు చేశారు.
- పాపిరెడ్డిపాలెంలో కూడా పశువుల మేత పోరంబోకు భూమిలో ఏర్పాటు చేశారు. దీంతో అనేక గ్రామాల్లో ఒక్క ఇల్లు కూడా నిర్మాణానికి నోచుకోలేదు.
- దర్శి మండలంలోని అబ్బాయిపాలెం, బట్టువారిపల్లి, గంగపాలెం, బండివెలిగండ్ల, తూర్పుచౌటపాలెం, బాపిరెడ్డిపాలెం, సామంతపూడి గ్రామాల్లో నిర్మించిన జగనన్న కాలనీల్లో ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు.
- కురిచేడు పట్టణ వాసులకు పశువుల మేత పోరంబోకు భూమిలో లేఅవుట్ వేశారు. ఆభూమికి గ్రామస్థులు అడ్డు పడటంతో వేరే ప్రదేశానికి మార్చారు. అక్కడ 173 గృహాలు కేటాయించినప్పటికీ ఒక్క గృహం కూడా నిర్మాణం చేపట్టలేదు.

ఒకరోజు ముందే పింఛన్లు

రేపే పంపిణీ

- ఒకటో తేదీ సెలవు కావటమే కారణం
- జిల్లాలో 2.81 లక్షల మందికి రూ.123.36 కోట్లు విడుదల
- చనిపోయిన వారి భార్యలకు 3,499 కొత్తవి మంజూరు
- వీరికి 12న అందజేయనున్న సిబ్బంది



ఒంగోలు నగరం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పింఛన్‌దారులకు శుభవార్త. ప్రభుత్వం ఒకరోజు ముందే సొమ్మును లబ్ధిదారులకు చేతికి అందించనుంది. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్‌ను అందిస్తున్న ప్రభుత్వం జూన్ ఒకటో తేదీన ఆదివారం సెలవు కావటంతో ముందురోజే వారి చేతికి సొమ్ము అందించనున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద జిల్లాలో మొత్తం 2,81,384 పింఛన్లు ఉండగా వీరికి సొమ్మును అందించేందుకు ప్రభుత్వం రూ.123.36 కోట్లను విడుదల చేసింది. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,49,045, వితంతువులు 68,253, దివ్యాంగులు 32,747, ఒంటరి మహిళలు 7,716, చర్మకారులు 5,240, డప్పు కళాకారులు 4,550, మత్స్యకారులు 2,447, చేనేత కార్మికులు 1,754, కల్లుగీత కార్మికులు 241, హిజ్రాలు 92, కళాకారులు 57,

మిగతా 6లో...


నేడు బ్యాంకుల నుంచి డ్రా

జిల్లాలో ఈనెల 31వ తేదీన ఉదయం 7 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాలోని 717 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని 5,555 మంది సిబ్బందిని పింఛన్ల పంపిణీ కోసం నియమించారు. పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన రూ.123 కోట్లను ఈనెల 30నే సచివాలయాల సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని శనివారం పంపిణీకి సిద్ధంగా ఉంచనున్నారు. ప్రభుత్వం పింఛన్ సొమ్మును సచివాలయాల వారీగా బ్యాంకుల్లో జమచేయగా వాటిని శుక్రవారం డ్రా చేసుకుని శనివారం ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించనున్నారు.

ఇంటింటికీ తాగునీరు

- జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్
- పనులను పరిశీలించిన కేంద్ర బృందం

7



పీడిస్తున్న ఫ్లోరిన్

- దశాబ్దాలుగా రాజుపాలెంలో అవస్థలు
- పలు రోగాలతో గ్రామస్థులు సతమతం
- మంచినీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి

7

ప్రమోషన్ కోసం పడిగాపులు

- 249 మంది టీచర్లకు అగచాట్లు

7


ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాల వద్ద కౌన్సెలింగ్ కోసం నిరీక్షిస్తున్న టీచర్లు

బయోగ్యాస్ ప్లాంట్ కోసం **భూముల పరిశీలన** 7

ప్రజలకు సత్వర న్యాయం కోసమే కోర్టులు
హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు 6




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





రేషన్ అక్రమాలకు చెక్ పడేనా?

(5వపేజీ తరువాయి)

తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు... సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయనున్నారు. ఇంకొకవైపు ఆ రేషన్‌షాపు పరిధిలో ఉండే దివ్యాంగులకు 65 ఏళ్ల వృద్ధులకు రేషన్‌షాపు డీలరే ప్రతిరోజు 12 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల లోపు వారి సరుకులను ఇంటికి చేర్చాల్సి ఉంది. 15 రోజుల పాటు డీలర్ రేషన్‌షాపు వద్ద అందుబాటులో ఉండి కార్డుదారులకు సరుకులు అందించాలి. మరోవైపు రేషన్ తూకం వేసి కార్డుదారులకు ఇచ్చేందుకు ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌ను లీగల్ మెట్రాలజీ ద్వారా తనిఖీ చేయించుకొని ధ్రువీకరణ పత్రాన్ని రేషన్‌షాపు డీలర్ పొందాల్సి ఉంది.

పారిశ్రామిక పరుగులు

(5వపేజీ తరువాయి)

ఎకరాల ప్రభుత్వ భూములను 2019లో ఏపీఐఐసీకి అప్పగించింది. ఈనేపథ్యంలో ఎన్నికలకు ముందు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో దొనకొండలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందుకోసం దొనకొండ మండలం రాగమక్కపల్లి రెవెన్యూ పరిధిలోని 254, 256/1, 257/1, 260/1, 260/3 సర్వే నెంబర్లలోని 43 ఎకరాల అనువైన ప్రభుత్వ భూమిని ఎంపిక చేసింది. చిన్నతరహా పరిశ్రమల పార్క్‌లో మొత్తం 268 ప్లాట్లు ఏర్పాటుచేసి కంపెనీలు నెలకొల్పేందుకు ఆసక్తిచూపే పారిశ్రామికవేత్తలకు అందించడానికి అప్పట్లో ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఏర్పాటుచేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో మౌలిక సౌకర్యాల ఏర్పాటు నిమిత్తం సైడుకాల్వలు, రహదారులు, చప్టాలు తదితర నిర్మాణ పనుల నిమిత్తం రూ.6.50 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్ ఎట్టకేలకు పనులు పూర్తిచేశారు. పారిశ్రామిక పార్క్ అభివృద్ధి గురించి అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణిగా వదిలేసింది. దీంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి చేపట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగమై, పారిశ్రామిక పార్క్ మొత్తం చిల్లచెట్లు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

నిరుద్యోగుల ఆశలపై వైసీపీ నీళ్లు

పారిశ్రామిక పార్క్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలోనే ఉపాధి పొందవచ్చని ఎంతో ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులు, నిరుపేదల ఆశలు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆడిఆశలుగానే మిగిలిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో కచ్చితంగా భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు ఖాయమని ప్రజలు భావిస్తున్నారు. దీంతో ఎంతో వెనుకబడిన ఈప్రాంతం అభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, పేదలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తండోపతండాలుగా..

(5వపేజీ తరువాయి)

ఆ రహదారి వెంట వందలాది వాహనాల్లో వెళ్లారు. సాయంత్రం కడప నుంచి తిరుగు ప్రయాణంలోనూ అదేదారిలో తమ స్వంత ప్రాంతాలకు తిరిగి రావడంతో రోజంతా పసుపుజెండాలు రెపరెపలాడుతూ వాహనాల రాకపోకలు కనిపించాయి. మూడు రోజుల పాటు జిల్లాకు చెందిన వివిధ స్థాయిల్లోని దాదాపు రెండువేల మంది నాయకులు కడపలోనే ఉండి మహానాడులో పాల్గొన్నారు. జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఉంసీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జులు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు పార్లమెంటల్ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ వంటి ముఖ్యులు మూడు రోజులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్లలో అధిష్టానం తరుపున పనిచేస్తున్న జిల్లాకు చెందిన రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మరింత క్రీయాశీలకంగా వ్యవహరిస్తూ వారం రోజులుగా కడపలోనే ఉన్నారు. మొత్తం మీద కడప మహానాడుకు ప్రతినిధులు, ముగింపు సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.

ఒకరోజు ముందే పింఛన్లు

(5వపేజీ తరువాయి)

అభయహస్తం 4,678, వ్యాధులతో బాధపడుతున్న వారు 4,035తో పాటు ఇతర పింఛన్లు కలుపుకొని మొత్తం 2,81,384 జిల్లాలో ఉన్నాయి.

జిల్లాకు 3,499 కొత్త పింఛన్లు మంజూరు

పింఛన్ పొందుతూ భర్త మరణిస్తే వారి భార్యలకు మరుసటి నెల నుంచే నూతన ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. ఇందుకుగాను జిల్లాకు చెందిన 3,499 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లను మంజూరు చేసింది. వీరికి జూన్ 12వ తేదీన లబ్ధిని పంపిణీ చేయనున్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 అక్టోబర్ వరకు మరణించిన పింఛన్‌దారుల భార్యలకు పింఛన్లను మంజూరు చేశారు.

అతివేగం బలిగొంది

- అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు
- ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు
- అంతా తెనాలి వాసులు

మేదరమెట్ల, మే 29(ఆంధ్రజ్యోతి): అతివేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. ముగ్గురు తోడికోడళ్లు. ఆడపడుచుతో కలిసి దైవదర్శనానికి వెళుతుండగా బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో హైవేపై గురువారం ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు తోడికోడళ్లలో ఒకరి కుమారుడు కారు నడుపుతున్నాడు. అంతా సజావుగా సాగుతున్న సమయంలో ఒక్కసారిగా కారు అదుపుతప్పింది. తెనాలికి చెందిన కన్నెగంటి ఝాన్సీ రాణి(60), కన్నెగంటి సూర్యకుమారి(62), కన్నెగంటి సరస్వతి(65)లు తోడికోడళ్లు. వాళ్లు తమ ఆడపడుచు కృష్ణంశెట్టి పార్వతిని కూడా తమతోపాటు తీసుకొని అరుణాచలం దైవదర్శనానికి బయలుదేరారు. ఝాన్సీరాణి కుమారుడు నాగార్జున కారు నడుపుతున్నాడు. ఉదయం 11.15 సమయంలో అతివేగంతో వెళుతున్న కారు మేదరమెట్ల-తిమ్మనపాలెం మధ్య అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డివైడర్‌పై ఉన్న దిమ్మెను బలంగా ఢీకొని రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న ఝాన్సీరాణి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సూర్యకుమారి, సరస్వతి, పార్వతి, నాగార్జులను అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సూర్యకుమారి, సరస్వతిలు మృతిచెందారు. నాగార్జున, పార్వతిలు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు.


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కె. మన్మథరావు

ప్రజలకు సత్వర న్యాయానికే కోర్టులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సత్వర న్యాయం అందించడానికే న్యాయస్థానాలు ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి కుంభజడల మన్మధరావు అన్నారు. సింగరాయకొండలో సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ విభాగం) ఏర్పాటుచేయడంలో కీలక పాత్ర పోషించిన ఆయనకు మండల ప్రజల ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక గంజివారి కల్యాణ మండపంలో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మధరావు మాట్లాడుతూ సింగరాయకొండలో కోర్టు ఏర్పాటు చేయడానికి ఆవశ్యకత, అవసరం ఉంది కాబట్టే ఇక్కడ కోర్టు ఏర్పాటు చేయడానికి కృషి చేశానని వివరించారు. సింగరాయకొండకు కోర్టు రావడంతో కొంతమంది న్యాయవాదులు నొచ్చుకున్నారని, ఆ దృక్పథం నుంచి బయటకు రావాలని హితవు పలికారు. నిబద్ధతో సేవలు అందిస్తూ ఉన్నతంగా ఆలోచించడం వల్లే అంచలంచెలుగా ఎదుగుతూ హైకోర్టు న్యాయమూర్తిగా అవకాశం వచ్చిందన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా 40 నెలల కాలంలో సుమారు 13వేలు తీర్పులు ఇచ్చినట్లు తెలిపారు. బదిలీలో భాగంగా త్వరలో కర్నాటక హైకోర్టు న్యామమూర్తిగా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా బావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల ప్రజలు, న్యాయవాదులు, బాల్యస్నేహితులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, అడ్వకేట్ పంగులూరి గోవిందయ్య, ప్రముఖ చారిత్రక పరిశోధకులు కొంపల్లి సుందర్, క్యాన్సర్ వైద్యులు నూకసాని సుబ్బారావు, అడ్వకేట్ మేకల రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షిత తాగునీరు

● జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్ ● పనులను పరిశీలంచిన కేంద్ర బృందం


కొళాయిలను పరిశీలిస్తున్న జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగు నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని అక్కచెరువు గ్రామంలో 2024 - 2025 సంవత్సరంలో రూ.96.10 కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా చేసిన పనులను ఆయన పరిశీలించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో పథకానికి సంబంధించిన వివరాలను, మ్యాప్‌లో పనుల పురోగతిని గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు వివరించారు. అనంతరం పనులు జరిగిన తీరును రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా మీ గ్రామంలో రూ.96.10 కోట్లతో ఇంటింటికీ తాగునీటి కొళాయి ద్వారా తాగునీరు అందిస్తున్న విషయం మీకు తెలుసా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ కొళాయిని ఏర్పాటు చేశారన్నారు. కొళాయి కనెక్షన్ లేనివారు వెంటనే అధికారికి తెలియజేయాలని బాలశంకరరావు సూచించారు. గతంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా కొన్ని ప్రాంతాలకు, కొత్తగా నిర్మించిన ట్యాంక్ ద్వారా మరికొన్ని ప్రాంగాలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆయనకు వివరించారు. మొత్తం గ్రామంలో 60వేల లీటర్ల నీరు సరఫరా అవుతుందన్నారు. నీటి సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం కొత్తగా నిర్మించిన 20వేల లీటర్ల ట్యాంక్‌ను, పశువుల షెడ్డును, నీటి కొళాయిలు, పొలాల్లో ఏర్పాటు చేసిన నీటి కుంటలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైన్‌లలో అనుమానం కలిగిన ప్రాంతాల్లో గుంతలు తీసి లోతును, పైపులైన్ నాణ్యతలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధికారి వాగీష్ తివారి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ జోసఫ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరకావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ డివిజన్ ఇంజనీర్ ఎం.సురేష్, ఏఈ నారాయణస్వామి, ఎంపీడీవో విజయలక్ష్మి,ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు, ఏపీవో మహాలక్ష్మి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


నీటిసరఫరాపై అధికారులతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్


భూములను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

బయోగ్యాస్ ప్లాంట్ కోసం భూముల పరిశీలన

కొనకనమిట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదారికట్ల, ఇరసలగుండం గ్రామాలలో గురువారం బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ భూములను పరిశీలించారు. పెదారికట్ల గ్రామంలో సర్వేనెంబర్ 686-2, 22, 692, 695, 694 సర్వేనెంబర్లలో గల 612.18 ఎకరాల భూములను ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఇరసలగుండం గ్రామంలో మరో 200 ఎకరాలు భూములు పరిశీలించారు. ఈప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటైతే స్థానికంగా ఉన్న యువతీయువకులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆవుల సురేష్, మండల సర్వేయర్లు, పలువురు వీఆర్వోలు ఉన్నారు.


డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్రం బృందం సభ్యులు

కనిగిరిలో కేంద్ర పరిశోధన బృందం పర్యటన

- ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రం, ఆర్‌వో ప్లాంట్ పరిశీలన

కనిగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర నీటి పరిశోధన బృందం గురువారం కనిగిరిలోని పలుప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా బృందం లోని ఐఏఎస్ అధికారి వాగేష్‌త్రిపాఠి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని రామతీర్థం జలశయాన్ని పరిశీలించినట్టు తెలిపారు. జలాశయం నుంచి కనిగిరి ప్రాంతానికి వచ్చే నీటిసరఫరా పైపుల ఏర్పాటుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటిని సేవించటం ద్వారా కిడ్నీలు దెబ్బతిని ప్రజలు డయాలసిస్ బారినపడుతుండటం పట్ల కేంద్రం ప్రత్యేక పరిశీలన చేసి నివేదిక అందజేయమని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జేజేఎం ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్రం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అలాగే డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలోని ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుపై అభినందించారు.

కనిగిరి ప్రాంతంలో ప్రజలకు మంచినీటి అందించనున్న నేపథ్యంలో అవసరమైన ఆర్‌వో ప్లాంట్‌లపై తగిన నివేదిక కేంద్రానికి అందజేస్తామన్నారు. కిడ్నీ రోగులతో మాట్లాడినపుడు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు బాధాకరమన్నారు. ఆసుపత్రిలోని కంగారు బేబీకేర్ కేంద్రాన్ని, ప్రసూతి కేంద్రాలను పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నోడల్ అధికారి దినేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్, ఈఈ సురేష్‌బాబు, డీఈఈ విశ్వనాధరెడ్డి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, బృందం సభ్యులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు లింగారెడ్డి

పరిహారం చెల్లించి న్యాయం చేయండి

జాతీయ రహదారిలో భూమిని కోల్పోయిన లింగారెడ్డి వేడుకోలు

పెద్ద దోర్నాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో భూమిని కోల్పోయి నష్ట పరిహారం అందలేదని కలెక్టర్ న్యాయం చేయాలని ఐనముక్కల గ్రామానికి చెందిన యక్కంటి లింగారెడ్డి గురువారం వినతిపత్రం అందజేశాడు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ కిన్నెర శాంతిని కలిసి లింగారెడ్డి తన గోడు వెల్లబోసుకున్నారు. దోర్నాలలోని 319/3 సర్వేనెంబరులో 2.14 ఎకరాల భూమి ఉందని, అయితే ఎన్‌హెచ్765 నిర్మాణ పనుల్లో భాగంగా 42 సెంట్ల భూమిని కోల్పోయానని, రోడ్డు పనులు పూర్తి కావస్తున్నా తనకు పరిహారం అందలేదని తెలిపారు. 3 సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం, ఆర్‌డీవో కార్యాలయం, ఒంగోలు కలెక్టర్ కార్యాలయం, కర్నూలు ఎన్‌హెచ్ అథారిటీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాండ్ కన్వెన్సన్ కాలేదని అధికారులు చెప్తున్నారని, 2022 జూలై 21వ తేదీన ఆర్‌డీవో కార్యాలయంలో కన్వర్షన్ చేయించుకున్నట్లు తెలిపారు. తర్వాతనే నేషనల్ హైవే నోటిఫికేషన్ జరిగిందన్నారు. చాలా సార్లు సంబంధిత అధికారులను కలిసి విన్నవించుకున్నానని ఇప్పటికీ పరిహారం అందలేదని, స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శాంతి మాట్లాడుతూ నష్ట పరిహారం ఎంత కావాలో ప్రభుత్వానికి అప్పీల్ చేసుకోకుండా నేరుగా కోర్టును ఆశ్రయించడంతో అధికారులు నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లేదని ఆమె తెలిపారు.

పీడిస్తున్న ఫ్లోరిన్

దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న రాజుపాలెం గ్రామస్థులు

పలు రోగాలతో సతమతం

మంచినీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న రాజుపాలెం గ్రామం ఫ్లోరిన్ నీటితో సతమతమవుతున్నారు. నగరపంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్నా ఫ్లోరిన్ సమస్య నుంచి వారిని తప్పించేవారు లేరు. సుమారు 170 కుటుంబాలు నివా సం ఉంటున్నాయి. వెయ్యి మందికిపైగా జనాభా ఉంది. అదే విధంగా 550కిపైగా ఓటర్లు ఉన్నారు. అయినా ఏన్నోఏళ్లుగా గ్రామంలోని ప్రజలు ఫ్లోరిన్ నీటిని తాగడం వలన కాళ్లు, చేతులు వంకరలు తిరిగాయి. కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. సుమారు 70 సంవత్సరాలకు పైగా ఫ్లోరిన్ సమస్య వేధిస్తోందని, చిన్నా, పెద్ద తేడాలేకుండా కాళ్ల చేతులు వంకర్లుపోవడం, పళ్ల గారపట్టడం, శరీరంలో మార్పులు రావడంతో శరీరం సహకరించకపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గ్రామస్థులు చెప్తున్నారు. గ్రామంలో ఏదైనా రాజకీయ కార్యక్రమం ఉందంటే హడావుడి చేస్తారు తప్ప తర్వాత కనపడరని వారు విమర్శిస్తున్నారు. 40ఏళ్ల కిందట అప్పటి గవర్నర్ కుమెదిన్‌మిన్ జోషి గ్రామ పరిస్థితి తెలుసుకొని సందర్శించి సాగర్‌నీటిని అందించేందుకు తక్షణమే ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. ఆ తరువాత కొంతకాలానికి పొదిలి నుంచి రాజుపాలెం గ్రామానికి సాగర్ పైపులైన్ వేశారు.

ఆ లైన్ ఇప్పటికి కొనసాగిస్తున్నారు కానీ సాగర్‌నీరు మాత్రం 10, 20 రోజులకోసారి కూడా రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు. బబుల్‌వాటర్ గతంలో రూ.10 ఉండేది, ఇప్పుడు రూ.15కి పెంచారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఆ నీటినే కొని తా గాల్సి వస్తుందని వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా కనీసం రెండురోజుకోసారి సాగర్‌నీటిని అందించి ఫ్లోరిన్ బాధ నుంచి కాపాడాలని రాజుపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.


రాజుపాలెం గ్రామం వ్యూ

తాగునీటికిఇబ్బందులు పడుతున్నాం

- గజ్జా వెంకటయ్య



ఏళ్లుగా తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నో సంవత్సరాల కిందట సాగర్‌పైపులైన్ వేశారు. మధ్యలో కొన్ని రోజులు ఇచ్చారు. తరువాత ఇవ్వలేదు. ఇప్పుడు సుమారుగా వారం, పదిరోజులకోసారి ఇస్తున్నారు. అవికూడా కింద ఉన్న ఒక్కబజారుకు వస్తాయి. అక్కడకు వెళ్లి తెచ్చుకోవాలి.

పైప్ లైన్ వేశారు - నీరు మరిచారు

- దోసపాటి వెంకటేశ్వర్లు



అప్పటి ప్రభుత్వం రాజుపాలెం గ్రామంలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉందని మాగ్రామానికి సాగర్‌పైపులైన్ వేశారు. అయితే అధికారులు సాగర్‌నీరు ఇవ్వకుండా మధ్యలో ఉన్న కాలనీలకు మళ్లించారు. ఇప్పుడు మాగ్రామానికి మంచినీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం.

చిన్న వయసులోనే వంగిపోతున్నాం

- జూపల్లి రాజయ్య

నీరుతాగితే చిన్న వయసులోనే వంగిపోతున్నాం. పళ్ల గారపట్టడం, కాళ్లు, నడుములు వంగిపోవడం వంటి రోగాల బారినపడుతున్నాం. విధిలేని పరిస్థితిలో రోజులు వెళ్లదీస్తున్నాం. మా ఊరికి సాగర్ పైపులైన్ వేశారు. వారానికోసారి ఇవ్వడం, మినరల్ వాటర్ తాగడం, గ్రామంలో బోర్ వాటర్ తాగడంతో నిత్యం జలుబు చేస్తోంది. ఒంటి నొప్పులు అధికంగా ఉంటున్నాయి.



ప్రమోషన్లకు పడిగాపులు

ఒంగోలు విద్య, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందేందుకు తయారు చేసిన సీనియారిటీ జాబితాలోని స్కూల్ అసిస్టెంట్ల కష్టాలు వర్ణనాతీతం. జిల్లాలో 83 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 30న ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు రోజుల ముందు నుంచే అధికారులు హడావుడి చేస్తూ టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 83 పోస్టులకు 249 మందితో సీనియారిటీ జాబితా తయారుచేశారు. ప్రమోషన్ల కోసం వీరిని బుధవారం సాయంత్రమే ఒంగోలు రమ్మన్నారు. వారు వచ్చి 4 గంటలకుపైగా ఎదురుచూసిన అనంతరం రాత్రి 8 గంటలకు కౌన్సెలింగ్ జాబితాలో టీచర్లందరూ గురువారం ఉదయం 8 గంటలకు ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలులో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రమోషన్ వస్తుందన్న ఆశతో గురువారం ఉదయం 9 గంటలకు అందరూ ఒంగోలు చేరుకున్నారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. మున్సిపల్‌హైస్కూళ్లలో మూడు, ఒంగోలు కార్పొరేషన్‌లో ఒక హెచ్‌ఎం పోస్టును పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు.

మాటమార్చిన అధికారులు

అయితే విద్యాశాఖ అధికారులు మాటమార్చారు. కమిషనరు మొదట వీరికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జాబితాలను తెరపై ప్రదర్శిస్తామని నేరుగా ఎంపిక చేసుకోవచ్చని మొదట చెప్పారు. తర్వాత మాట మార్చి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ప్రమోషన్ కోరుకునే వారు వద్దనుకునే వారు అందరూ వేచిచూడాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటలకు కూడా ఆన్‌లైన్‌లో సీనియారిటీ జాబితా రాకపోవడంతో టీచర్లు ఎదురుచూస్తూ కూర్చున్నారు. కౌన్సెలింగ్‌కు అన్నీ సిద్ధం చేసుకున్నాక టీచర్లను రమ్మనాల్సింది పోయి వారిని ముందుగానే పిలిచి గంటలకొద్దీ కూర్చోబెట్టి వారి సహనాన్ని పరీక్షించారు. హెచ్‌ఎం ప్రమోషన్ల కౌన్సెలింగ్ విషయంలో అధికారులు అవలంబిస్తున్న తీరును టీచర్లు నిరసిస్తున్నారు.

ఆర్‌డీఎస్ఎస్‌తో భరోసా



సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రాభివృద్ధి దిశగా శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనాలు ఉండేలా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈక్రమంలోనే రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)తో అటు రైతన్నలకు, చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసే ఔత్సాహికులకు, గ్రామీణులకు కూటమి ప్రభుత్వం భరోసా ఇవ్వనుంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. అందులో భాగంగా గ్రామాలకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు పల్లెలకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా, వ్యవసాయ కరెంటు ఆధారంగా నడిచేది. అంటే వ్యవసాయ విద్యుత్ ఏడు లేదా తొమ్మిది గంటలు సరఫరా అయితే గ్రామాల్లో ఆమేరకు 3ఫేజ్ కరెంటు ఉంటుంది. ఆసమయంలోనే ప్రజలు తాగునీరు కూడా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి వీల్లేకుండా ఉంది. కేవలం 9 గంటల విద్యుత్ మాత్రమే ఉంటే పరిశ్రమలకు ఇబ్బందులు తప్పవు. ఈసమస్యలను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ అనే పథకాన్ని అమలు చేస్తోంది.

ఇప్పటి దాకా పట్టణాల్లో తప్ప గ్రామాల్లో 24 గంటలు 3 ఫేజ్ కరెంటు సరఫరా లేదు. దీనివలన పరిశ్రమ ఏర్పాటు కుదిరేది కాదు. మండలంలో వ్యవసాయం పుష్కలంగా ఉన్నా సంబంధిత చిన్నతరహా పరిశ్రమలు లేవు. ఏ పరిశ్రమలు పెట్టుకోవాలన్నా పట్టణంలో లేదా పట్టణానికి దగ్గరగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ఆప్రాంతాల్లో భూములు లేనివారు పారిశ్రామిక ఆలోచనను విరమించుకోవాల్సిందే. ఈపరిస్థితుల్లో ప్రభుత్వం అమలు చేస్తోన్న ఈపథకం ఎందరో ఔత్సాహికులకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నది. గ్రామాల్లో కావలిసిన మౌలిక వసతులు ఉంటాయి. ఇప్పుడు విద్యుత్ కూడా నిరంతరాయంగా అందుబాటులోకి రావడంతో గ్రామాలకు మంచి అవకాశాలు ఏర్పడనున్నాయి.

> త్వరలో గ్రామాలకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్
>
> కేంద్రప్రభుత్వ పథకంతో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

చక చకా పనులు జరుగుతున్నాయి

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించడానికి, ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈపథకాన్ని అమలు చేస్తోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 24 అగ్రికల్చరల్ ఫీడర్లను బైఫర్‌కేషన్ చేసి అగ్రికల్చర్‌తో పాటు విడిగా మరొక ఫీడర్‌ను ఏర్పాటుచేస్తున్నాం. దీని వలన గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా అవుతుంది. వీటి కోసం ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేస్తున్నారు.నియోజకవర్గంలో రూ.43కోట్లతో పనులు ప్రారంభించాం. త్వరగా పూర్తి చేసి గ్రామాలకు నిరంతరం 3ఫేజ్ సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నాం.

- శ్రీకాంత్, విద్యుత్ శాఖ డీఈ, ఒంగోలు రూరల్

101 మంది ప్రధానోపాధ్యాయుల బదిలీ

ఒంగోలు విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలలో మొదటగా 101 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను మార్పు చేస్తూ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో బదిలీ కోసం 141 మంది హెచ్‌ఎంలు దరఖాస్తు చేశారు. వీరిలో 14మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. 127 మంది అభ్యర్థన మేర బదిలీ కోసం దరఖాస్తు చేశారు. మొత్తం దరఖాస్తుల్లో వివిధ కారణాలతో రెండింటిని తిరస్కరించారు. మిగిలిన వారిలో 101 మంది బదిలీ కాగా 38 మంది యథాస్థానాల్లో ఉండిపోయారు. బదిలీ అయిన హెచ్‌ఎంలు అందరూ ఈనెల 31న సాయంత్రం ప్రస్తుతం వారు పనిచేస్తున్న పాఠశాల నుంచి రిలీవై జూన్ 1 ఉదయం కొత్త పాఠశాలలో బాధ్యతలు స్వీకరించాలి. సంబంధిత ఉపవిద్యాధికారులు బదిలీ అయిన హెచ్‌ఎంలకు రిలీవింగ్ ఉత్తర్వులు జారీచేస్తారు.

వేటపాలెంలో ఎన్టీఆర్ స్మారక మ్యూజియం

వేటపాలెం(చీరాల), మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులసంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఎన్టీఆర్ స్మారక మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపకులు చంద్ర సుబ్రహ్మణ్య శివరాంకు ఘనస్వాగతం పలికారు. అలాగే మ్యూజియంలో ఎన్టీఆర్ జీవితచరిత్ర, రాజకీయ చరిత్ర, తదితర ముఖ్యమైన పుస్తకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో సంఘం స్థానిక అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు, కార్యదర్శి వెంకటలక్ష్మీ ప్రసాద్, నాగాంజనేయులు, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జలవనరులశాఖ కార్యాలయానికి మోక్షమెపుడో..?

- రూ.80లక్షల ప్రపంచబ్యాంకు నిధులతో నిర్మాణం
- ఐదేళ్ల నుంచి పూర్తి కాని కొద్దిపాటి పనులు
- శిథిలభవనంలో కార్యకలాపాల నిర్వహణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చీమకుర్తి, మే 29(ఆంధ్రజ్యోతి) : ప్రపంచబ్యాంకు వద్ద అప్పు తెచ్చి మరీ నిర్మించుకున్న భవనం ఐదేళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అసాంఘీక కార్యకలాపాలకు నెలవుగా మారినా అధికార యంత్రాం గంలో ఎటువంటి చలనం లేకపోయింది. వర్షం పడితే తడిసిముద్దవుతున్న శిథిల భవనాల్లో విధులు నిర్వహిస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారే కాని 90 శాతంకు పైగా పనులు పూర్తయిన భవనానికి మిగిలిన పనులు పూర్తిచేసి నూతన భవనంలో కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ఆలోచనే యంత్రాంగంలో లేకపోవటం గమనార్హం. ఇదీ చీమకుర్తి పట్టణంలో ఉన్న జలవనరులశాఖ చీమకుర్తి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం కథ. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కార్యాలయం శిథిలస్థితికి చేరుకొని ఎప్పుడు కూలిపోతుందో అన్న భయాందోళన నెలకొని ఉంది. వర్షం పడితే ఉరిసిపోతుండటంతో రికార్డులను భద్రపరచలేక సిబ్బంది సతమతమువతున్నారు. దీంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టారు. దాదాపు భవన నిర్మాణం తొంభైశాతం పూర్తి అయింది. తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణాన్ని పూర్తిచేయటంపై దృష్టి సారించకపోవటంతో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఇంకా ప్రధాన గేటు నిర్మాణం, విద్యుత్‌పనులు మిగిలిపోయి ఉన్నాయి. ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు అయితే నూతన కార్యాలయం ప్రారంభించుకొని అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. లేదంటే ఇప్పటికే అసాంఘీక కార్యకలాపాలకు నెలవుగా ఉన్న ఈ భవనం ప్రారంభం కాకుండానే దెబ్బతినే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తికాని నూతన భవనం


శిథిలావస్థలో ఉన్న ప్రస్తుత కార్యాలయం

ఒరిగిన విద్యుత్ స్తంభం..

- చేతికి అందేలా వేలాడుతున్న తీగలు
- ఆందోళనలో కూనంనేనివారిపాలెంలోని బీసీకాలనీవాసులు


ఒరిగిపోయి ఉన్న కరెంటు స్తంభం, కిందుగా వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న స్థానికులు

చీమకుర్తి, మే29(ఆంధ్రజ్యోతి): కూనంనేనివారిపాలెంలో విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. కరెంటు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతూ ఏ క్షణానా ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయాందోళన స్థానికుల్లో నెలకొంది. గ్రామంలోని బీసీకాలనీలో కరెంటు స్తంభం ఓ పక్కకు ఒరిగిపోవడంతో తీగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఈ ప్రాంతవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఈ ప్రాంతంలో తీగలకు సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులు విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. అంతకుముందే ఈ ప్రాంతవాసులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఒరిగిన విద్యుత్‌స్తంభం, వేలాడుతున్న తీగలు అంతా సచివాలయం ఎదుటే ఉంటం గమనార్హం. ఇక్కడ ఎనర్జీ అసిస్టెంట్ ఉన్నా మరమ్మతులు చేపట్టాలనే ఆలోచనే కలుగకపోవటం విస్మయం కలిగిస్తోంది. ఇటీవల జరిగిన పంచాయతీ సమావేశంలో కూడా పాలకవర్గం ఈ అంశంపై తీర్మానం చేసింది. మండల విద్యుత్‌శాఖాధికారులకు సైతం సమాచారం ఇచ్చినా వారిలో చలనం లేకపోవటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కరెంటు తీగలను సరిచేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

31న జిల్లా క్రికెట్ జట్లు ఎంపిక

ఒంగోలు (కార్పొరేషన్), మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఒంగోలు నగరం మంగమూరు రోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో క్రికెట్ అండర్-23, సీనియర్స్ పురుషుల జట్లు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు జూన్ నెలలో మంగళగిరి, మూలపాడు మైదానంలో జరిగే ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటాయన్నారు. సెలక్షన్స్‌కు హాజరయ్యేవారు వైట్‌డ్రస్, షూస్, సొంత కిట్‌లతోపాటు జనన ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు కోచ్‌లు సుధాకర్ : 9701022333, బి.చంద్ర : 9246222999 ద్వారా సంప్రదించాలని కోరారు.

డీఐఈవో ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ


ఆంజనేయులును అభినందిస్తున్న లెక్చరర్లు

ఒంగోలు(విద్య), మే29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారిగా తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కొండపల్లి ఆంజనేయులు గురువారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులును వివిధ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కుమ్మరగుంట సురేష్, ప్రిన్స్‌పాల్స్ సంఘ నాయకులు రంగనాయకులు, బీసీహెచ్.అల్లూరయ్య, విశ్వనాథ్‌బాబు, వెంకట్రావు, మాధవరావు, గురవయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూముల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పీసీపల్లి, మే 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని దివాకరపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటుచేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ భూములను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. మండలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 652లో 475.57 ఎకరాల భూమిలో రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు గత నెలలో భూమిపూజ చేశారు. సదరు భూమి ప్రభుత్వానిది కావడంతో కౌలు పద్ధతిలో రిలయన్స్‌కు కేటాయించేందుకు ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ నుంచి ప్రతిపాదనలు కోరుతూ రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు వచ్చాయి. ఈమేరకు జేసీ గోపాలకృష్ణ, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌తో కలిసి సంబంధిత భూమిని పరిశీలించారు. రికార్డులు, సర్వే మ్యాప్‌లు పరిశీలించిన ఆయన సంబంధిత కంపెనీకి కౌలుకు అప్పజెప్పేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తిచేసి నివేదించాలని తహశీల్దార్ ఉషను ఆదేశించారు. అనంతరం మండలంలోని మారెళ్ల రేషన్ దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని ఆయన ఆదేశించారు.

'పెట్టుబడి సాయం'తో రైతుకు భరోసా!

- వచ్చే నెలలో విడుదల


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): పంట పొలాలు సాగు చేసేందుకు రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ ఒకటి. పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.2వేలు చొప్పున మూడు విడతలుగా మొత్తం రూ.6వేలను రైతుల ఖాతాలో జమ చేస్తోంది. ఇక అన్నదాత సుఖీభవ పథకంలో రూ.14వేలు కలిపి ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయాన్ని మూడు విడతల్లో కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే అందించాలన్నా ఉద్దేశంతో కసరత్తు ప్రారంభించింది. జిల్లాస్థాయిలో పరిశీలన పూర్తి అయ్యాక వెబ్‌ల్యాండ్ వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తారు. ఆధార్ అనుసంధానంగా అర్హులను గుర్తించి తుది జాబితాను రైతు సేవా కేంద్రాలకు పంపిస్తారు. లబ్ధిదారులందరితో ఈ-కేవైసీ చేయించాల్సి ఉంటుంది.

పరిశీలనలో బ్యాంకు ఖాతాలు

సంతనూతలపాడు మండలపరిధిలో 17 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. మొత్తం రైతులకు చెందిన బ్యాంకు ఖాతాలు 17,272 ఉండగా వీటిలో ఎటువంటి ఇబ్బందులు లేని రైతు ఖాతాలు 12,498. ఒకరి పొలానికి మరొకరి ఆధార్ నెంబరు లింకు కావడం తదితర సమస్యలకు సంబంధించి 1,358 ఖాతాలను సరిచేయాలని మండల రెవెన్యూ విభాగానికి పంపారు. పొలం ఎవరి పేరుమీద ఉందో ఆ వ్యక్తి చనిపోయి ఉన్నవి, జాయింటు ఎల్‌పీఎంలో, ఇతరుల్లో ఉండటం వంటి ఖాతాలు 3,136 ఉన్నాయి. 280 ఖాతాలను వ్యవసాయ సహాయకులు పరిశీలించాల్సి ఉంది.

పారదర్శకతకు పెద్దపీట

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపికలో మరింత పారదర్శకత తీసుకురావాలన్న లక్ష్యంతో రైతు సేవా సేవా కేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ గ్రామ వ్యవసాయ సహాయకులతోపాటు మండల వ్యవసాయ అధికారి లాగిన్లకు ఇచ్చారు. హౌస్‌హోల్డ్ సర్వే ప్రకారం రేషన్‌కార్డుల్లో పేర్లు, ఆధార్‌కార్డు, 1బి పత్రాలను పరిశీలిస్తున్నారు. సర్వే నెంబర్లు, విస్తీర్ణం ఖచ్చితంగా ఉన్నది లేనిదీ పరిశీలించి వివరాలను ఏవో లాగిన్‌కు అనంతరం సంబంధిత జిల్లా అధికారులకు పంపిస్తారు. వెబ్‌ల్యాండ్‌లో ఏమైనా తప్పులు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సరిచేస్తారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామ వ్యవసాయ సహాయకులు అర్హుల జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన

పెట్టుబడి సాయం కింద లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో మండలంలోని ఆయా గ్రామాల్లో క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతానికి నిర్ధేశిత గడువు పెట్టలేదు. సాధ్యమైనంత త్వరగా పరిశీలన చేసేందుకు సిబ్బంది కసరత్తు ప్రారంభించారు. మృతిచెందిన రైతుల పేర్లను పోర్టల్ నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జూన్‌లో రైతులకు మొదటి విడత సాయం మంజూరు అవుతుందని వారు పేర్కొంటున్నారు.

దళితులపై దాడి చేసిన సీఐలను అరెస్టు చేయాలి

- పలు సంఘాల నాయకుల డిమాండ్


ధర్నా చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో దళిత యువకులపై నడిరోడ్డులో దాడి చేసిన పోలీసులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మాల సంఘాలు, ఎంఆర్‌పీఎస్‌ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యుడైన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమండ్ చేశారు. తెనాలిలో ఈనెల 24న దళిత యువకులైన హైకోర్టు న్యాయవాది, మరో ఇద్దరు యువకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు వారిని సీఐలు రాములునాయక్, రమేష్‌బాబులు నడిరోడ్డుపై ఇష్టారీతిన కొట్టారని ఆరోపించారు. కొన్ని నెలల క్రితం తెనాలిలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని దళిత యువకులు అడ్డుకున్నారు. ఈక్రమంలో మూడు రోజుల పాటు జరిగిన ఆందోళనతో అంబేడ్కర్ విగ్రహాన్ని కొత్తది ఏర్పాటు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారన్నారు. ఈనేపథ్యంలో తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి పోలీసుల ద్వారా దళిత యువకులను కొట్టిన వారిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీలం నాగేంద్రరావు, రావినూతల కోటి, కురిబల్లి అశోక్‌బాబు, కొప్పోలు ఏడుకొండలు, రఘురాం, చిరుతోటి శోభన్, మోజేష్, జీవరత్నం, దారా అంజయ్య, కాకుమాని రవి, దండపూడి యోహాన్ పాల్గొన్నారు.

నిరాశలో.. పొగాకు రైతులు

- పెరిగిన పెట్టుబడులు
- దిగజారుతున్న ధరలు



మద్దిపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఒకపక్క అధిక పెట్టుబడులు, మరోపక్క అరకొర దిగుబడు లు, నామమాత్రపు ధరలు.. వెరసి వైట్ బర్లీ పొగాకు రైతులు కలవరానికి గురవుతున్నారు. రోజురోజుకు దిగజారుతున్న ధరలు మానసిక వేదనకు గురిచేస్తోంది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. గత ఏడాది దిగుబడితో పాటు ధరలకు కూడా ఆశాజనకంగా ఉండటంతో వైట్ బర్లీ విస్తీర్ణం భారీగా పెరిగింది. వైరస్‌తో మిర్చిపంట సరైన దిగుబడి లేక, శనగ పంట దెబ్బ తినడంతో ప్రత్యామ్నాయంగా వైట్ బర్లీ పొగాకు సాగు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైట్ బర్లీ రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ధరలు సగానికి పైగా తగ్గిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్లె సమస్యతో పాటు పొగాకు దిగుబడి తగ్గిపోయింది. మొదటి విడత పొగాకు అమ్మితే సాగు ఖర్చులో కనీసం నాలుగోవంతైన వస్తుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఉన్న ధరల నేపథ్యంలో పొగాకును చేలో వదల్లేక తీసుకొని రావాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. కింటా రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు కొనుగోలు చేయాలని పొగాకు రైతులు వేడుకుంటున్నారు. ఒకపక్క దళారులు మాయాజాలంతో అసలు ధర ఎంత ఉందో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం మార్కెట్లో పలుకుతున్న ధర ప్రకారం పంట అమ్ముకుంటే పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైట్ బర్లీ పొగాకును కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం


సంతనూతలపాడులో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు


ఒంగోలులో జరిగిన శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని ఆయుర్వేద వైద్యాధికారి కరుణాకర్, ఈవోఆర్డీ రమణమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాల్లో భాగంగా గురువారం సంతనూతలపాడు ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా శరీరానికి, మనస్సుకు మంచిదన్నారు. మానసిక ఒత్తిడి దూరం చేస్తుందని తెలిపారు. యోగా శిక్షణ కార్యక్రమాలు ఈనెల 31వరకు జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండలపరిషత్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్): యోగాతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందని వివేకానంద హఠయోగా శిక్షణ కేంద్రం శిక్షకులు రామారావు పేర్కొన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాయం గురువారం అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలకు శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు, ఏవో శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీన చలో విజయవాడ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 5వతేదీన చలో విజయవాడ చేపడుతున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒంగోలులోని సంఘం కార్యాలయంలో గురువారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధానమైన 14 డిమండ్ల సాధన కోసం ఈ సభను ఏర్పాటు చేశారన్నారు. ఆరోజున విజయాడలోని లయోలా కాలేజీ ఆవరణలో జరిగే సంఘం రాష్ట్ర కౌన్సిల్ మూడవ సభకు తరలిరావాలని కోరారు. విజయవాడ సభకు వెళ్లేందుకు ఉదయం ఆరు గంటలకు స్థానిక కలెక్టరేట్ ఎదుట బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, కోశాధికారి ఏసురత్నం, తాలూకా అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, ఈదర శ్రీనివాసరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, చెంచారావు, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపే పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు మే నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఈనెల 31న ఉదయం 7గంటల నుంచే ప్రారంభమవుతుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 6,643 మంది పెన్షనర్లు ఉండగా రూ.2,85,91,500 నగదు బ్యాంకులో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం బ్యాంకులకు వెళ్లి నగదు విత్‌డ్రా చేయాలని ఆయన కోరారు.

ఆగిఉన్న ఆటోను ఢీకొట్టిన మరో ఆటో

- పలువురికి స్వల్పగాయాలు


రోడ్డు పక్కన పొదల్లో పడిన ఆటో

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో పలువురు మహిళలకు, చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఒంగోలు నుంచి సంతనూతలపాడు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో ఎండ్లూరు డొంక సమీపంలో ట్రిపుల్ ఐటీ కళాశాల వద్ద ఆగింది. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న మరో ఆటో వేగంగా వస్తూ అదుపు తప్పి ఆగిఉన్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆ ఆటో ఎగిరి చెట్లపొదల్లో పడింది. ఈక్రమంలో ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, చిన్నారులు ఇరుక్కుపోయారు. ఈ విషయం గమనించిన స్థానికులు కొందరు వారి బయటకు లాగి చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

రేషన్‌షాపుల్లో అవకతవకలు జరిగితే చర్యలు


రేషన్‌బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

మద్దిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందించాల్సిన నిత్యావసర వస్తువులు డీలర్లు తప్పనిసరిగా అందించాలని, ఏమైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.నారాయణ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఏడుగుండ్లపాడు 16వ నెంబర్ రేషన్ షాపును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు రేషన్‌కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లి తమకు రావాల్సిన వస్తువులను డీలర్ వద్ద తెచ్చుకోవాలన్నారు. బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, రాగిపిండి, గోధుమపిండి డీలర్లు అందజేయాలన్నారు. అంత్యోదయ కార్డులో 35 కేజీలు బియ్యాన్ని అందించాలని, డీలర్లు ఎవరైనా బియ్యాన్ని అందజేయకుండా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. మండలంలో 48 రేషన్ షాపులు ఉన్నాయని, లబ్ధిదారులు ఏ రేషన్ షాపునకు వెళ్లినా సరుకులు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమణయ్య, డీలర్ నావూరి వరలక్ష్మి, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

ఒంగోలు(రూరల్), మే29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామం నుంచి కడపలో జరుగుతున్న టీడీపీ శ్రేణులు మహానాడుకు గురువారం తెల్లవారుజామున 4గంటలకు బయలుదేరి వెళ్లారు. రెండు బస్సుల్లో కార్యకర్తలు, నాయకులు బయలుదేరగా సీనియర్ నాయకులు తగిన ఏర్పాట్లు చేశారు.

సేవా కార్యక్రమాలకు సహకారం

ఒంగోలు కల్చరల్, మే 29(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అనాధలు, దివ్యాంగులు మొదలైన వారికి చేసే ఎలాంటి సేవా కార్యక్రమానికైనా తనవంతు సహకారాలు ఎప్పుడూ ఉంటాయని కమ్మవారి సమాక్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆయన ఇటీవల ఆ పదవికి ఎన్నికైన సందర్భంగా గురువారం స్థానిక అన్నవరప్పాడులోని శివం ఫౌండేషన్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో పలువురు మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న మురళీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, శేషయ్య, మండవ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం జరిగింది.

క్రీడలతో స్నేహభావం పెంపు


తహసీల్దార్‌కు బొకేను అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావాన్ని పెంపొందించుకోవచ్చని తహసీల్దార్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామపురంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కొణిజేటి శివకుమార్, మనీ, చందు, సాయిభరత్, భావన, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటాపాటలతో ఆస్వాదిస్తూ..!

వేసవి శిబిరాల్లో బాలల సందడి ● విజ్ఞానదాయక అంశాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

గ్రంథాలయాలతో కాలక్షేపం



సంతనూతలపాడు గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుకుంటున్న విద్యార్థులు

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు పక్కన పెట్టి కాసేపు ఆడుకునే సమయం చిక్కింది. స్నేహితులతో సరదాలు, నచ్చిన ఆటలతో కాలక్షేపం వారి దినచర్యగా మారింది. అయితే పలువురు విద్యార్థులు రోజులో కొంత సమయం తమ అభిరుచులకు పదునుపెడుతూ వేసవి శిక్షణ శిబిరాలకు హాజరవుతున్నారు. విజ్ఞానదాయక అంశాలను నేర్చుకునేందుకు ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు సంతనూలపాడులోని గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్నారు.

పిల్లలకు నేర్పించే అంశాలు

● పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేసేందుకు వారికి నచ్చిన బొమ్మల కథలు, నీతికథలను చదివిస్తారు. నిపుణులైన బోధకులు, ఆంగ్లభాషా నైపుణ్యం, చిత్రలేఖనం, యోగా సాధన, వైకుంఠపాళి, చదరంగం ఆడటం తదితర అంశాలను నేర్పిస్తున్నారు.

● పిల్లలకు సౌకర్యంగా ఉండేందుకు వారికి అవసరమైన పుస్తకాలు టేబుల్‌పై అమర్చి కుర్చీలు వేయడంతో వారికి నచ్చినవి చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా వస్తువులను అమర్చారు. దీంతో వారికి ఇష్టమైన పుస్తకాలు చదువుతూ, ఆడుకుంటూ సందడి చేస్తున్నారు.

ఒక రోజు కథలు చదువుతా.. మరొక రోజు ఆడుకుంటా..

-సుభాష్, 8వ తరగతి

స్కూలుకు వెళ్లే సమయంలో పాఠాలకు సంబంధించిన పుస్తకాలను మాత్రమే చదువుకునేవాడిని. గ్రంథాలయంలో వేసవి శిక్షణకు వచ్చాక ఒకరోజు పుస్తకాలు చదువుకుంటూ, మరొకరోజు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నాను. గ్రంథాలయంలో నీతికథలు కూడా చదివి వినిపిస్తారు. వేర్వేరు స్కూళ్లలో చదివే వారంతా ఇక్కడ స్నేహితులమయ్యాం. శిక్షణ ఎంతో బాగుంది.

బొమ్మలు గీయడం నేర్చుకున్నా..

- సృజన, 7వ తరగతి

బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. సొంతంగా గీయడం తెలిదు. ఎలా గీయాలో నేర్పిస్తున్నారు. దీంతో స్నేహితులతో కలిసి సరదాగా చదరంగం, వైకుంఠపాళి ఆడుకుంటున్నాం. ఇంగ్లీషులో రాయడం, చదవడం నేర్చుకుంటున్నా. అందరితో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తూ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

మార్కండేశ్వరుడికి అన్నాభిషేకం



అన్నాభిషేకంలో మార్కండేశ్వరుడు

మార్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో వెలసివున్న జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మలు స్వామికి అన్నాభిషేకం, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా ప్రతిష్ఠ

గిద్దలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అచ్చంపల్లి గ్రామంలో వైభవంగా ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సీతాలక్ష్మణ హనుమాన్ సమేత పట్టాభిరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. 3 రోజులపాటు జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో మనోజ్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కామూరి రమణారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పురమంతా మురుగుమయం

- రూ.లక్షలు ఖర్చు చేసినా మారని తీరు
- వర్షం పడితే రోడ్లపై పారుతున్న నీరు

మార్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి నానాటికీ అధ్వానంగా మారుతోంది. వర్షాకాలం వచ్చి చినుకులు రాలాయంటే వీ.దులు చిత్తడిగా మారిపోతున్నాయి. మురుగు కాలువల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో వర్షం బాగా కురిసిదంటే రోడ్లపైకి మురుగు నీరు చేరుతోంది. వర్షాకాలంలో ప్రజలు బయటకు రావాలంటే ముక్కుపుటాలదురుతున్నాయని బెంబేలెత్తిపోతున్నారు. రూ.లక్షల మేర మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం మురుగు కాలువల్లో నిర్వహణ పనులు చేపడుతున్నా పరిస్థితిలో మార్పురావడంలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడం వలనే ఈ దుస్థితి దాపురించినట్లు తేటతెల్లమవుతోంది. పర్యవేక్షించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడమే ప్రజలకు శాపమవుతోంది.



వర్షం పడితే అయ్యప్పస్వామి గుడి వద్ద ఇదీ పరిస్థితి



కోర్టు సెంటర్‌లో చెత్తతో పూడిన మురికి కాలువ



ఫారెస్ట్ ఆఫీస్ తూర్పు గేటు వైపు పూర్తిగా పూడిపోయిన మురుగు కాలువ

ప్రధాన కాలువల్లో పూడికతీతతో సరి

మార్కాపురం పట్టణం నానాటికీ విస్తరిస్తోంది. నూతనంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పారిశుధ్యం పరిస్థితి అంతంతమాత్రంగా ఉందంటే సరే అనుకోవచ్చు. కానీ ప్రధాన పట్టణంలోని పలు కీలకమైన ప్రాంతాల్లోని మురికి కాలువల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వర్షాకాలానికి ముందే మురుగు కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టి పూర్తి చేయాలి. నెలన్నర క్రితమే రూ.30 లక్షలతో పట్టణమంతా పూడిక తీత పనులు చేపట్టారు. కానీ కంభం రోడ్డు, కాలేజీ రోడ్డు, తర్లుపాడు రోడ్డులాంటి ప్రధాన రహదారుల వెంబడి మాత్రమే పూడికతీత పనులు పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో చాలా వరకు కాలువల్లోని పూడికను తీసిన పాపాన పోలేదు. దీంతో వర్షం పడిందంటే కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోయి నీరు పారక రహదారులపైకి చేరుతున్నాయి. కొన్ని చోట్ల నీటి కుంటలను తలపిస్తున్నాయి. స్థానిక పోస్టాఫీసు నుంచి కంభం బస్టాండ్ వరకు ఉన్న మురికి కాలువ పూర్తిగా పూడిపోయింది. దీంతో వర్షం పడితే ప్రజలు రోడ్డుపైన నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదే విధంగా స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం సమీపంలో కూడా పరిస్థితి ఇదే విధంగా ఉంది. సత్యనారాయణస్వామి దేవస్థానం సమీపంలోని సుమారు ఆరు వీధులు, కాలేజీ రోడ్డులోని లక్కీ షోరూమ్ ప్రాంతంలోని వీధుల్లో కూడా ఇదే దుస్థితి నెలకొంటోంది. పరిస్థితిని ఎక్కడికక్కడ గమనించి చక్కదిద్దాల్సిన పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు లేకపోలేదు.



గ్రంథాలయ పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి

విజ్ఞాన శిక్షణను వినియోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలు వేసవి సెలవులు వృథా కాకుండా శిక్షణలో భాగంగా విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. మార్కాపురంలోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం ఆమె పరిశీలించి మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పెంచే వివిధ అంశాలను నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం, పుస్తక పఠనం, కథలు చెప్పించడంతో పాటు హ్యాండ్ రైటింగ్ శిక్షకుడు తిరుపాలయ్య చేతిరాతలో శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని వేంకటేశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షుడు గంజి వీరయ్య అన్నారు. శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులకు ఆయన పాల్గొన్నారు. చదువుతోపాటు ఖాళీ సమయాలలో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని, గ్రౌండ్‌కు వెళ్లి వివిధ ఆటల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా ఫిట్‌నెస్‌తోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎం ఓబులేసు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామిరెడ్డి, శిక్షకులు సాయి, సాయికుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా డే



కంభంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

గిద్దలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో యోగా డే కా ర్యక్రమాన్ని ఉద్యోగులు నిర్వహించారు. వివిధ రకాల యోగాసనాలను వేశారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక రుగ్మతలు పోతాయని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా గురూజీ నారాయణరెడ్డి సూచించారు.

కంభం : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 3వ రోజు కంభం ప్రభుత్వ జూ నియర్ కళాశాల ఆవరణలో ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ఎర్రగొండపాలెం : యోగాతో శారీరక, మానసిక ఎదుగులతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం యోగాంధ్రలో భాగంగా సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగాతో విద్యార్థులు ఉల్లాసంగా ఉంటారని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధరనాయుడు అన్నారు. కాలేజీలో గురువారం విద్యార్థినిలకు విద్యార్థినీవిద్యార్థలకు యోగా శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సబ్సిడీ రుణాలివ్వాలి

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌లకు సంబంధించి సబ్సిడీ రుణాలను అర్హులకు అమలు చేయాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి కోరారు. గురువారం మండలపరిషత్ అధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మదార్‌వలి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు కొన్ని బ్యాంకుల వారు రుణాలు ఇస్తే ఏవిధంగా తీరుస్తారని ప్రశ్నిస్తున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీల్లో, సచివాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌ఛైర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను అమలు పరిచే విధంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మార్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలైన ఘటన ఎస్టేట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు.. తర్లుపాడు మండలం మంగలకుంట గ్రామానికి చెందిన జవ్వాజి నాగేశ్వరరావు, షకీల దంపతులు మోటార్ సైకిల్‌పై మార్కాపురం వస్తున్నారు. స్థానిక ఎస్టేట్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నాగేశ్వరరావు, షకీల దంపతులు ఎగిరి పడ్డారు. వారిని స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం షకీల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్సై సైదుబాబు దర్యాప్తు చేస్తున్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

వ్యక్తికి తీవ్రగాయాలు

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో బైకిస్ట్‌కు తీవ్రగాయాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శావల్యాపురం మండలం చినకంచెర్లకు చెందిన పెనుమాల లక్ష్మీనారాయణ కాకర్ల గ్రామంలో బొప్పాయిలోడు చేసుకొని తిరిగి బైకుపై పొదిలి వస్తున్నాడు. పొదిలి వైపు నుంచి ఒంగోలు వస్తున్న టిప్పర్ బైకును కాటూరివారిపాలెం సమీపంలో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం ఒంగోలుకు తరలించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై హెచ్‌సీజీ, ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పటల్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వైద్యాధికారి చక్రవర్తి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు కాన్సర్ సెంటర్ అసోసియేట్ మార్కెట్ మేనేజర్ సంద్రపాటి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్జికల్, అంకాల్‌జిస్ట్ ఆళ్ల దీప్తి ఉచితంగా రోగులను పరిక్షిచనున్నట్లు ఆయన చెప్పారు. పాప్ స్మియర్, సీఏ125, పిఎస్‌ఏ పరిక్షలు అవసరమున్నవారికి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు పాత రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. 31వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 7416001416 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కనుక ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



డ్రోన్ వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రద్యుమ్న

రైతులు పథకాలను వినియోగించుకోవాలి

శాస్త్రవేత్త ప్రద్యుమ్నయాదవ్

పొదిలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆదాయ మార్గాలను పెంచుకోవాలని నూనెగింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ప్రద్యుమ్న యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో కృషి విజ్ఞాన్ కేంద్రం, రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ కృషి సంకల్ప అభిమాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల ఆదాయం పెంచడం, ఖర్చు తగ్గించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎరువులు, పురుగుమందులు ఏ సమయంలో వాడితే మంచి దిగుబడులు వస్తాయనే విషయాలను రైతులు గమనించాలన్నారు. రైతులు మట్టి పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు. నూనె గింజల సాగును పెంచాలన్నారు. డ్రోన్ల వినియోగంతో ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయనిర్మల, డీపీఎం సుభాషిణి, దర్శి కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి, ఏపీసీడ్స్ మేనేజర్ బుచ్చమ్మ, పొదిలి వ్యవసాయాధికారి షేక్ జైన్‌లాబ్దీన్, ఉద్యాన అధికారి సంధ్య, జిల్లా వనరుల వ్యవసాయాధికారి శేషమ్మ, వ్యవసాయసహాయకులు నర్మద, సర్పంచ్ శ్రీనివాసులు రైతులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ' పరికరాల పంపిణీ



పరికరాలను అందజేస్తున్న పోస్టల్ అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : హెడ్ పోస్టాఫీస్‌లో విశ్వకర్మ పథకం కింద శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులకు పరికరాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్ పోస్ట్ మాస్టర్ ఇందిర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకంలో భాగంగా శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులకు పోస్ట్ ఆఫీస్ ద్వారా వచ్చిన కోత మిషన్లు, కటింగ్ మిషన్లు, పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు మేనేజర్ సాయిరాం, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, దేవిశెట్టి చంద్రశేఖర్, శాసనాల సరోజిని పాల్గొన్నారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా గిద్దలూరు

గిద్దలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపాలిటీ గ్రేడ్-2గా అప్‌గ్రేడ్ అయింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో నగర పంచాయతీగా ఉన్న గిద్దలూరుకు గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ మున్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ కావడం వలన మరిన్ని నిధుల లభ్యత, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు తెలిపారు.

మహానాడుకు తరలిన తమ్ముళ్లు



పెద్దారవీడు, కంభం, వైపాలెం నుంచి మహానాడుకు వెళ్తున్న టీడీపీ శ్రేణులు

మార్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పార్టీ తరఫున ఏర్పాటు చేసిన సుమారు 50 బస్సుల్లో తరలారు. మార్కాపురం పట్టణం నుంచి సుమారు 50 కార్లలో కార్యకర్తలు వెళ్లారు. చాలామంది కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వారే వాహనాలను ఏర్పాటు చేసుకుని వెళ్లడం విశేషం. మార్కాపురం నియోజకవర్గం నుంచి సుమారు 3 వేల మందికి పైగా మహానాడుకు వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

గిద్దలూరు టౌన్ : కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గం నుంచి 80 ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతోపాటు 100 కార్లలో ప్రయాణమయ్యారు. వీరందరికీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మెదుకూరు-పోరుమామిళ్ల మధ్యలో భోజన ఏర్పాట్లు చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న నమ్మకం, నారా లోకేష్‌పై విశ్వాసం ప్రతి ఒక్కరిలో కనిపించిందని, మహానాడుకు తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల నుంచి కడపలో జరుగుతున్న మహానాడుకు 3వ రోజు వివిధ వాహనాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివెళ్లారు. మండలాలలోని ప్రతి పంచాయతీ నుంచి టీడీపీ నాయకులు సొంత వాహనాలలో తరలివెళ్లారు.

కొమరోలు : మహానాడుకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. కొమరోలులో బుధవారం మండలంలోని కార్యాకర్తలు, నాయకులు తరలివెళ్లి వాహనాలను ఆయన జెండా జెండాను ఊపి ప్రారంభించారు.

పెద్దారవీడు : తెలుగుతేజం కోసం నిరంతర కృషి చేస్తామని తెలుగుతమ్ముళ్లు నినదించారు. కడపలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభలో పాల్గొనేందుకు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి ఆరు బస్సులు, పలు కార్లలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుదేశం విధి, విధానాలను ప్రజలలోకి ప్రతి ఒక్కరూ తీసుకువెళ్లి పార్టీ ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ నిరంతరం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకులు గుమ్మా గంగరాజు, పార్టీ నాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డి, గొట్టం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

డీలర్ల వద్దే రేషన్ సరుకుల పంపిణీ

- చౌక దుకాణాలకు చేరిన బియ్యం, పంచదార
- ఎండీయూల సేవలు నిలిపివేత

ఎర్రగొండపాలెం రూరల్ మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ప్రభుత్వం ఎండీయూల (రేషన్ పంపిణీ వాహనాలు) ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థను నిలిపివేసింది. ఎండీయూల ద్వారా జరిగే పంపిణీలో భారీ అవినీతి జరుగుతుందని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. యథావిధిగా పాత పద్ధతిలో డీలర్ల ద్వారా ప్రజా పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టింది. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు డీలర్ల వద్ద అందజేయనున్నారు. ఎర్రగొండపాలెం సివిల్ సప్లై పరిధిలో ఉన్న ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలకు సంబంధించి ఇప్పటికే రేషన్ సరుకులు డీలర్‌ల వద్దకు చేరాయి.

మండలాలవారీగా షాపుల వివరాలు

ఎర్రగొండపాలెం మండలంలో 43,
త్రిపురాంతకం మండలంలో 42,
పుల్లలచెరువు మండలంలో 35



రేషన్ దుకాణంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం, పంచదార

మొత్తం 120 రేషన్ దుకాణాల ద్వారా డీలర్లు ప్రతి రోజు 1 నుంచి 15వ తేదీ వరకు తెల్లకార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని సివిల్ సప్లై డీటీ భ్రమరాంబ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధ కృష్ణ తెలిపారు.

మండలాలవారీగా రేషన్ కార్డులు, సరుకుల వివరాలు

మండలం	కార్డులు	బియ్యం (కే.జిలలో)	పంచదార (ప్యాకెట్‌లలో)
ఎర్రగొండపాలెం	19, 917	29, 8,391	20వేలు
త్రిపురాంతకం	938	26,7,645	19, 300
పుల్లలచెరువు	17,714	24, 7,032	18, 100

కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

మార్కాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్డుదారునికి జూన్ 1వ తేదీ నుంచి డీలర్లు రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ సూచించారు. ఎమ్‌డీయూ ఆపరేటర్ల స్థానే జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో దుకాణాల్లో అన్ని వసతులు, సంసిద్ధత సక్రమంగా ఉండా లేదా అని గురువారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ తనిఖీ చేశారు. ముఖ్యంగా 65 సంవత్సరాలు దాటి ఒంటరిగా ఉండే వృద్ధులు, దుకాణాల వద్దకు రాలేని ఒంటరి వికలాంగులు ఉంటే తప్పకుండా రేషన్ డీలరే వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అందించాలన్నారు. సకాలంలో రేషన్ సరుకులు కార్డుదారులకు అందించాలన్నారు. అంతేకాక ఎలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.చిరంజీవి, రెవిన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రామనారాయణరెడ్డి పలు రేషన్ దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులను రేషన్‌షాపుల వద్ద పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పట్టణంలో 15 రేషన్ దుకాణాలు ఉన్నాయని, లబ్ధిదారులు తమ పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రంగయ్య, ఖాశింవలి ఉన్నారు.

డీలర్లు వేళలు పాటించాలి

ఎర్రగొండపాలెం : చౌకదుకాణాల వద్ద డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ మంజునాథరెడ్డి గురువారం ఆదేశించారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటలవరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులను తెరిచి ఉంచి కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందజేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరు, డీలర్లు పాల్గొన్నారు.

కొమరోలు : రేషన్ దుకాణాలకు వచ్చే కార్డుదారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లతో రెవెన్యూ, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ యాట్లాడుతూ సరుకులను సక్రమంగా అందజేయాలని, కార్డుదారుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్సుమెంటు డీటీ వెంకట్రామిరెడ్డి, డీటీ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంటు నాయక్, డీలర్లు పాల్గొన్నారు.



కంభం రోడ్డులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా మానసిక రుగ్మతలు తగ్గి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ గడ్డె ఏడుకొండలు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పుండరీ కాంక్షయ్య, ఎంపీడీవో బ్రహ్మయ్య, జీవీ అరవిందారెడ్డి, కేఎల్ శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామూరు సచివాలయం ఆవరణలో అభివృద్ధి పనులు

పామూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పామూరు ఒకటో గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతి నిధులతో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. గతంలో సచివాలయం నిర్మించినప్పుడు ఆవరణ ప్రాంతం అభివృద్ధి చేయకుండా వదిలివేశారు. దాంతో పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బందితో పాటు ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో పంచాయతి నిధులతో సచివాలయం చుట్టూ లెవలింగ్ పనులు చేపట్టి సిమెంట్ కంకరతో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నట్లు పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితులు మనోధైర్యంగా ఉండాలి

పీసీపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ బాధితులు మనోనిబ్బరంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ అన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఈసందర్భంగా ఫ్లోరోసిస్ బాధితులతో మాట్లాడారు. ఫ్లోరోసిస్‌తో బాధపడేవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వారికోసం అవసరమైన రీహేబిలిటేషన్ పరికరాలను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం చేతికర్రలు, వాకర్స్, టాయిలెట్ సీట్స్ తదితర పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యషిత, సీహెచ్‌వో భాగ్యవేణి, సూపర్‌వైజర్ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం తరుపున నిర్వహిస్తున్న వేసవి తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు ఆళ్ల బాస్కరరావు. తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు కథలు చదివించడం, చెప్పించడం, యోగాసనాలు, వేయించుట, లుడో ఆటలు ఆడించడం చేశారు. కార్యక్రమంలో ఎస్.వెంకట్రామయ్య, కె.భారతి పాల్గొన్నారు.

31న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఒంగోలు (కార్పొరేషన్), మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఒంగోలు నగరం మంగమూరు రోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో క్రికెట్ అండర్-23, సీనియర్స్ పురుషుల జట్లు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు జూన్ నెలలో మంగళగిరి, మూలపాడు మైదానంలో జరిగే ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటాయన్నారు. సెలక్షన్స్‌కు హాజరయ్యేవారు వైట్‌డ్రస్, షూస్, సొంత కిట్‌లతోపాటు జనన ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు కోచ్‌లు సుధాకర్ 9701022333, బి.చంద్ర 9246222999 ద్వా రా సంప్రదించాలని కోరారు.

5న చలో విజయవాడ

ఒంగోలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 5వతేదీన చలో విజయవాడ చేపడుతున్నట్లు ప్రభుత్వ ఉద్యో గుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒంగో లులోని సంఘం కార్యాలయంలో గురువారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యానారాయణ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉద్యో గులు ఎదుర్కొంటున్న ప్రధానమైన 14 డిమండ్ల సాధన కోసం ఈ సభను ఏ ర్పాటు చేశారన్నారు. ఆరోజున విజయాడలోని లయోలా కాలేజీ ఆవరణలో జరిగే సంఘం రాష్ట్ర కౌన్సిల్ మూడవ సభకు తరలిరావాలని కోరారు. విజయ వాడ సభకు వెళ్లేందుకు ఉదయం ఆరు గంటలకు స్థానిక కలెక్టరేట్ ఎదుట బ స్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, పట్టణ అధ్య క్షుడు మోటా శ్రీనివాసరావు, కోశాధికారి ఏసురత్నం, తాలూకా అధ్యక్షుడు సు రేష్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, ఈదర శ్రీనివాసరావు, శ్రీనివాసులు, చంద్ర శేఖర్, చెంచారావు, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

31నే పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు మే నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఈనెల 31న ఉదయం 7గంటల నుంచే ప్రారంభమవుతుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఓప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం బ్యాంకులకు వెళ్లి నగదు విత్‌డ్రా చేయాలని ఆయన కోరారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

» జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దొనకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అందిస్తూ ప్రోత్సహిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని తెల్లబాడు, ఆరవల్లిపాడు గ్రామాల్లో గురువారం జరిగిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం నిర్వహించిన ప్రీ-ఖరీఫ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల గురించి వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా పొలాలను లోదుక్కులు చేపట్టాలన్నారు. దానివల్ల వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని, కలుపును కూడా సమర్థవంతగా అరికట్టవచ్చునని చెప్పారు. పశుసంవర్థక శాఖ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.షణ్ముగం మాట్లాడుతూ పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి యాజమాన్య పద్ధతులు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర పశువుల పెంపకం యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కేవీకే నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి, జీసీహెచ్ నారాయణ, రమేష్‌దాస్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల వెల్లువ

పామూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కీలకమైన రేషన్ కార్డుల కోసం, మార్పులు చేర్పులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు విస్మరించింది. దీర్ఘకాలంగా క్రొత్తవి మంజూరుచేయలేదు. ఈనెల 7 నుంచి కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. ఇప్పటికే కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందుతున్నాయని సచివాలయాల సిబ్బంది తెలుపుతున్నారు. ఈక్రమంలో సర్వర్ సమస్య వేధిస్తున్నది. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రామాణికంగా దరఖాస్తులను సచివాలయాల్లో స్వీకరిస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో డిజిటల్ సహాయకుల లాగిన్‌లో నమోదు చేశాక, వీఆర్వో లాగిన్‌కు నివేదిస్తున్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుచేసే ప్రతివ్యక్తికి ఈకేవైసీ తప్పనిసరి. ఆతరువాత తహసీల్దార్ లాగిన్‌కు పంపుతారు. అక్కడ ఆమోదం తెలిపాక అర్జీదారులకు రేషన్‌కార్డు నెంబర్‌తో సెల్‌ఫోన్‌కు సమాచారం (ఎస్ఎంఎస్)వస్తుందని అధికారులు తెలుపుతున్నారు. దరఖాస్తులో అత్యధికంగా కార్డుల్లో సభ్యులను చేర్చడానికే వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రేషన్ కార్డులను రద్దుచేసి వాటిస్థానంలో జగన్ బొమ్మతో కార్డులను పంపిణీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం సమగ్ర వివరాలతో కూడిన స్మార్ట్ బియ్యం కార్డులను లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించింది.



రేషన్‌కార్డుల కోసం సచివాలయంలో దరఖాస్తు చేస్తున్న ప్రజలు

కొత్త రేషన్ కార్డులు, ఇతర సేవలకు ఇది నిరంతర పక్రియగా ప్రభుత్వం ప్రకటించిందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎనిమిది రకాల సేవలకు దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూముల పరిశీలన

వీసీపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివాకరపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటుచేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. మండలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 652లో 475.57ఎకరాల భూమిలో రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు గత నెలలో భూమిపూజ చేశారు. సదరు భూమి ప్రభుత్వానిది కావడంతో కౌలు పద్ధతిలో రిలయన్స్‌కు కేటాయించేందుకు ఎన్ఆర్ఈడీసీఏపీ నుంచి ప్రతిపాదనలు కోరుతూ రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు వచ్చాయి. ఈమేరకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌తో కలిసి సంబంధిత భూమిని పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులు, సర్వే మ్యాప్‌లు పరిశీలించిన ఆయన సదరు భూమిని ఎన్ఆర్ఈడీసీఏపీ ఆదేశాల మేరకు సంబంధిత కంపెనీకి కౌలుకు



రిలయన్స్‌కు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో తదితరులు

అప్పజెప్పేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తిచేసి నివేదించాలని తహశీల్దార్ సీహెచ్ ఉషను ఆదేశించారు.

రేషన్‌షాపు తనిఖీ

బియ్యం సరఫరా వాహనాలను రద్దుచేసిన ప్రభుత్వం జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించిన తరుణంలో జేసీ గోపాలకృష్ణ మండలంలోని మారెళ్ల రేషన్ దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలోని రిజిస్టర్లను పరిశీలించారు.

దుకాణం పరిధిలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, ఎన్ని రైస్ కార్డులు ఉన్నాయని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. దుకాణం పైకప్పును పరిశీలించిన ఆయన వర్షం వస్తే సరుకులు తడిచిపోతాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డీలర్‌ను ఆదేశించారు. ఆయనవెంట ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఉష తదితరులు ఉన్నారు.

నేడు కోదండరామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



వేంపాడులో విగ్రహాల ఊరేగింపు

ముండ్లమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం జరుగుతుంది. ఈక్రమంలో గురువారం ఆలయంలో ప్రతిష్ఠించనున్న సీతాలక్ష్మణ స్వాములతో పాటు ధ్వజస్తంభాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమం, హోమాలు జరుగుతున్నాయి. ముందుగా అంబేడ్కర్ కాలనీ నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వరకు భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు విగ్రహాల వెంట భారీగా తరలివెళ్లి కోదండ ఆలయం సన్నిధిలో ఉంచారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ధ్వజ స్తంభం ప్రతిష్ఠించనున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి రాచూరి పెద్దమ్మ తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు), మే 29 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలోని శ్రీరాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమవుతుంది. శుక్రవారం ప్రత్యేక పూజలు, శనివారం వెంకటేశ్వరస్వామి జలధి ఉత్సవం, పూజా పొంగళ్లు, మహాఅన్నదానం, ఆదివారం అంకాలమ్మ దేవస్థానం వద్ద బండారువార్లకు మైల కప్పెర కార్యక్రమం. అంకాలమ్మతల్లి జలధి ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జూన్ 2న గుర్రప్పస్వామి పూజలు, మహాఅన్నదానం, 3న అమ్మవారి పుట్టబంగారంకు పోవడం, అన్నదానం, పుట్టమట్టి తీసుకురావడం, అమ్మవారి జలధివాసం, రాత్రికి అమ్మవారికి సింహాసనంపై కూర్చోబెట్టడం జరుగుతుంది. 4న అమ్మవారి గ్రామోత్సవం, 5న పొంగళ్లు, గండదీపాలు, ఎడ్ల బలప్రదర్శన పోటీలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎడ్ల పోటీల్లో మెదటి బహుమతి రూ.1,00116, రెండో బహుమతి రూ.75,116, మూడో బహుమతి రూ.50,116, నాల్గో బహుమతి రూ.30,116, ఐదో బహుమతి రూ.20,116 ఇస్తున్నట్లు తెలిపారు.



రాచూరి పెద్దమ్మ తల్లి

మహానాడుకు భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

దర్శి, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో గురువారం జరిగిన మహానాడు బహిరంగ సభకు దర్శి నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ముఖ్యనాయకులు రెండు రోజుల క్రితమే మహానాడులో పాల్గొనేందుకు వెళ్లారు. మిగిలిన కార్యకర్తలు, అభిమానులు అన్నిగ్రామాల నుంచి ఏర్పాటుచేసిన బస్సుల్లో, వాహనాల్లో గురువారం ఉదయం తరలివెళ్లారు.

దొనకొండ: మహానాడుకు గురువారం టీడీపీ దొనకొండ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో తరలివెళ్లారు. పలుగ్రామాలకు చెందినవారు ప్రత్యేక వాహనాల్లో వెళ్లగా, మరికొందరు రైళ్లలో భారీగా తరలివెళ్లారు.

పామూరు: కడపలో గురువారం జరిగిన టీడీపీ మహానాడు సభకు పామూరు, సీఎస్‌పురం మండలాల నుంచి భారీగా తరలివెళ్లా రు. ప్రత్యేక వాహనాలకు టీడీపీ మండలాల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వరు, బొమ్మనబోయిన వెంగయ్యలు జండా ఊపి ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, కంచర్ల శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం నుంచి ఎస్‌సీ మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, షేక్ రజ్జబ్‌బాషా, పాములపాటి ప్రసాద్, తోటా చిన్నా, తదితరులు తరలివెళ్లారు.



పీసీపల్లి: పెదయిర్లపాడు నుంచి మహానాడుకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు

పీసీపల్లి: మహానాడు సభకు పీసీపల్లి మండలంలోని టీడీపీ శ్రేణులు గురువారం కడపకు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండలంలోని 18 పంచాయతీల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలం నుంచి పది బస్సులు, 20కార్లలో బయలుదేరి వెళ్లిన కార్యకర్తలు అక్కడ మహానాడులో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని కలుసుకున్నారు. మహానాడుకు బయలుదేరిన వాహనాలను పీసీపల్లిలో ఆపార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య దగ్గరుండి పంపించారు. మహానాడుకు తరలివెళ్లిన వారిలో మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామకమిటీ అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

ముండ్లమూరు: కడపలో గురువారం జరిగిన మహానాడు సభకు ముండ్లమూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలువాహనాల్లో భారీగా తరలివెళ్ళారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వెళ్ళిన నాయకులు, అభిమానులు అక్కడ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులను కలిశారు.

ఒంటిమిట్ట ఆలయంలో పూజలు



ఒంటిమిట్ట సీతారాముల స్వామి ఆలయంలో పూజలు చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడులో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు కడప జిల్లా ఒంటి మిట్టలోని శ్రీసీతారాములస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కడప పట్టణంలోని దర్గాలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సంగా తిరుపతిరావు తదితరులు కూడా దర్గాలో పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో జరిగిన మహానాడు దిగ్విజయమైందని చెప్పారు. గతానికి భిన్నంగా ఈసారి మహానాడును సాంకేతికను ఉపయోగించుకొని నిర్వహించినట్టు చెప్పారు. మహానాడులో చేసిన తీర్మానాల అమలుద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవలంబించే విధానా లను కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలను మహానాడు ద్వారా నేతలు వివరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, వివిద మండలాల నాయకులు పాల్గొన్నారు.

'వికసిత్ కృషి సంకల్ప అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలి



కృషి విజ్ఞాన కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంను ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి, మే 29(ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈకార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అనువైన పైర్లు సాగుచేసుకునేందుకు వీలుగా రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహణకు శాస్త్రవేత్తలు మూడు బృందాలుగా ఏర్పడి కురిచేడు, దొనకొండ, పొదిలి మండలాల్లో ముందుగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వచ్చేనెల 12 వరకు శాస్త్రవేత్తలు గ్రామాల్లో పర్యటించి భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కౌలుదారులకు గుర్తింపు కార్డులు

ముండ్లమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో కౌలు రైతులకు 2025 - 26 సంవత్సరానికి సంబంధించి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎల్ .లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1331 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినట్టు చెప్పారు. గ్రామ స్థాయిలో వాస్తవంగా సాగుదారుల వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది సేకరించి గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. సాగుదారు హక్కు పత్రాలు ఉన్న కౌలు రైతులకు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. జూన్ నెలాఖరులోగా ప్రతి కౌలుదారుడికి సాగుదారు హక్కు పత్రం జారీ చేయాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు



శంకరాపురంలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు

ముండ్లమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో జూన్ 1 నుంచి ఏర్పాటవుతున్న రేషన్ షాపులను గురువారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ పరిశీలించారు. కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రతిఒక్కరికి నిత్యావసర సరుకులు అందే విధంగా చూడాలని డీలర్లను ఆదేశించారు. షాపు వద్ద సక్రమమైన తూకంతో పాటు ధరల పట్టిక తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్డుదారులకు ప్రతి రోజు సరుకులు ఇచ్చే సమయాన్ని పొందుపరచాలన్నారు. ఏఒక్క కార్డుదారుడిని ఇబ్బందులకు గురిచేస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందుగా గ్రామాల్లో దండోర వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మూర్తి, వీఆర్‌వోలు, డీలర్లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

ముండ్లమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు నాయకులు, కార్యకర్తలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి గురువారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పెదఉల్లగల్లు, పసుపుగల్లు, పోలవరం, సింగనపాలెం, ఈదర గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ20వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటానని శివప్రసాదరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, పార్టీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, సూదిదేవర అంజయ్య, వైస్ఎంపీపీ బంకా నాగిరెడ్డి, సుంకర బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవో ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ



ఆంజనేయులును అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు(విద్య), మే29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారిగా తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కొండపల్లి ఆంజనేయులు గురువారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులును వివిధ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కుమ్మరగుంట సురేష్, ప్రిన్స్‌పాల్స్ సంఘ నాయకులు రంగనాయకులు, బీ సీహెచ్.అల్లూరయ్య, విశ్వనాథ్‌బాబు, వెంకట్రావు, మాధవరావు, గురవయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

30-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	33	27
బాపట్ల	34	28
రెంటచింతల	35	27
చీరాల	34	28

విద్యాకిట్లు.. వచ్చేశాయ్





- ఎమ్మార్సీ కేంద్రాలకు చేరిన విద్యా కిట్లు
- ఈ ఏడాది నుంచి రెండు సెమిస్టర్ల విధానం
- ప్రభుత్వ బడుల్లో తగ్గనున్న బ్యాగ్ బరువు

గుంటూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నది. బడి ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రెండు వారాలు ముందుగానే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని ఆయా మండలాల పరిధిలోని విద్యా వనరుల కేంద్రాలకు తరలించేందుకు జిల్లాస్థాయిల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో విద్యా వనరుల కేంద్రాలకు ఆయా పుస్తకాలను తరలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పేరుతో ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పంపిణీ చేయనున్నది. ఈ కిట్లలో రెండు స్కూల్ యూనిఫామ్, బ్యాగు, బూట్లు, టై తదితరాలతో పాటు తరగతుల వారీగా పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీ ఉంటాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మండల పరిషత్, ప్రభుత్వ జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యికి పైగా

(మిగతా 6లో)

11 మంది హస్తం.. అదుపులో 9 మంది?

జంట హత్యల నిందితుల వేటలో పోలీసులు

మాచర్లటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో 11 మంది హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇప్పటికే 9 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు సెల్ టవర్స్ లొకేషన్ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. వెల్దుర్తి మండలం రామచంద్రాపురంతండా కృష్ణానది ఒడ్డున ముగ్గురు ప్రధాన నిందితులను, గుండ్లపాడులో నలుగుర్ని, గుంటూరులో ఒకరిని, హైదరాబాద్‌లో ఒకరిని అదుపులోకి తీసుకుని రహస్య ఠాణాలో విచారిస్తున్నట్లు తెలిసింది. జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులతో కలిసి వెళ్లిన బంధువుల్లోని ఓ వ్యక్తి ద్వారా ఫోన్‌లో సమాచారం తెలుసుకుని పథకం ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సుమారు రూ.5 లక్షల చొప్పున నలుగురి బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో నిందితులను కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు సమాచారం.

మరణంలోనూ తోడు

- రోడ్డు ప్రమాదంలో తోడికోడళ్లు దుర్మరణం
- మేదరమెట్ల దగ్గర ప్రమాదం.. తెనాలివాసులు ముగ్గురు మృతి
- అరుణాచలం వెళ్తుండగా ఘటన.. మూడు కుటుంబాల్లో తీరని శోకం

తెనాలి, మే 29, (ఆంధ్రజ్యోతి): వారు ముగ్గురూ తోడికోడళ్లు.. వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చారు.. ప్రేమ, ఆప్యాయతలతో అక్కచెల్లెళ్లను మరిపించారు. చివరకు ఆ మరణంకూడా విడదీయలేకపోయింది. వారి సంతోషాన్ని విధి చూసి ఓర్వలేక రోడ్డు ప్రమాదంలో ముగ్గురు జీవితాలను కాటేసింది. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు తోడికోడళ్ల మృతితో తెనాలిలో విషాదం అలుముకుంది. మూడు కుటుంబాల్లో శోకం మిగిల్చింది. తెనాలికి చెందిన కన్నెగంటి నరసింహారావుకు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు సోదరులు. వీరంతా తెనాలిలో వ్యాపార, విద్యా సంస్థల నిర్వహణలో చెంచుపేట నందులపేట ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరు ముగ్గురూ సూర్యకుమారి(62), సరస్వతి(65), ఝాన్సీరాణి(60)లను వివాహం చేసుకున్నారు. ఒక్కొక్కరికి ఇద్దరేసి సంతానం. వారందరికీ కూడా వివాహాలయ్యాయి. ముగ్గురూ 60 పదుల వయస్సులో భర్తలతో సంతోషంగా శేషజీవితం గడుపుతున్నారు. ఈ క్రమంలో అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలనే ఆలోచనతో ఈ ముగ్గురు తోడికోడళ్లు ఆడబిడ్డ పార్వతితో కలిసి ఝాన్సీరాణి కుమారుడి కారులో గురువారం ఉదయం అరుణాచలం బయలుదేరారు. బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర డివైడర్‌ను కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ముగ్గురు తోడికోడళ్లు మృతి చెందారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఇంటి నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే ప్రమాదం గురించి తెలిసి ఆయా కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బంధువులు



ప్రమాద స్థలిలో నుజ్జునుజ్జయిన కారు

ఖరీఫ్‌పై... కదలరా?



- విత్తన కేటాయింపుల్లో రాని స్పష్టత
- కొలిక్కిరాని కాల్వల మరమ్మతుల పనులు
- రైతులు సిద్ధమైనా వ్యవసాయశాఖలో లోపించిన సన్నద్ధత
- పంటల డిమాండ్‌పై రైతులకు దిశానిర్దేశం చేసే వారే కరువు
- విత్తన నాణ్యత ధ్రువీకరణ నుంచి భూసార పరీక్షల వరకు నిర్లక్ష్యం

వరుణుడు కరుణించాడు.. మేఘాలు వర్షిస్తున్నాయి.. చినుకులతో భూమాత పులకిస్తోంది.. రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమవుతున్నాడు.. అయితే ప్రభుత్వ పరంగా యంత్రాంగంలో ఖరీఫ్‌పై ఇంతవరకు కదలికే లేదు. గత రెండు సీజన్లలో ఆలస్యంగా ఖరీఫ్ ఆరంభం కావడం.. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో రైతులు చాలావరకు నష్టపోయారు. ఈ ఏడు ముందస్తు రుతుపవనాలతో ముందస్తుగా సాగు చేపట్టి ప్రకృతి వైపరీత్యాలను తప్పించుకోవాలని రైతులు ఆశించగా యంత్రాంగం నుంచి సహకారం లేదని తేటతెల్లమవుతోంది. విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు, విత్తన నిర్ధారణ పరీక్షలు, కాల్వల మరమ్మతులు.. ఇలా అన్ని విషయాల్లోనూ ఆయా విభాగాల అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందస్తు ఖరీఫ్ సత్ఫలితాలు సాధించాలంటే ఆయా విభాగాల మధ్య సమన్వయం కూడా ఎంతో కీలకం. ప్రస్తుతం అది లోపించడం కూడా అన్నదాతలకు శాపంగా మారింది. వ్యవసాయ, ఉద్యాన శాఖలతో పాటు ఇరిగేషన్ విభాగాలు సమన్వయంతో అడుగులు వేయాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఇదెక్కడా కనబడటంలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏటా జూన్ మూడో వారంలో ఖరీఫ్ ఊపందుకుంటోంది. అయితే ప్రస్తుతం వానలు ముందుగానే పలకరించాయి. దీంతో ఖరీఫ్ పనులు జూన్ ఆరంభం నుంచే ప్రారంభం కానున్నాయి. ముందస్తు ఖరీఫ్ సాగు చేపట్టడం ద్వారా ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తులను కొంతమేర తప్పించుకోవచ్చు. దీంతో పాటు ఖరీఫ్ ముందస్తు సాగు ద్వారా సీజన్‌లో మూడో పంట సాగును రైతులు చేయవచ్చనేది ఈ ముందస్తు ప్రణాళికల్లో భాగం. అయితే ఇందుకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ నుంచి ప్రభుత్వం కల్పిస్తుందని అన్నదాతలకు భరోసా ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో ముందస్తు ఖరీఫ్‌పై సదరు విభాగం సన్నద్ధత కనబడడం లేదు. విత్తనాల నాణ్యతను ఈ సారి పూర్తి స్థాయిలో పరిశీలించాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఆ దిశగా ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వరి, మిరపతో పాటు పత్తి పెద్దఎత్తున సాగు చేస్తుంటారు. ఆయా కంపెనీలు సీజన్ ఆరంభంలోనే విత్తన నాణ్యత ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయశాఖకు

(మిగతా 6లో)

ఖరీఫ్ సాగు విస్తీర్ణం

బాపట్ల జిల్లాలో మొత్తం 2,67,469 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ సాగు ఉండనుందనేది వ్యవసాయ శాఖ అంచనా. దీనికి 65,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు అదనం. గుంటూరు జిల్లాలో 1.24 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయనే అంచనా. పల్నాడు జిల్లాలో 4.60 లక్షల ఎకరాలుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ఎలాగైతే మిగులు వర్షపాతం నమోదవుతుందనే అంచనాలను ఐఎండీ చెబుతుండడంతో రైతులు ఖరీఫ్ సాగుపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు.

ఇలాగైతే ఎలా?

- ఇప్పటి వరకూ విత్తన నాణ్యత పరిశోధన జాడేలేదు.
- ఏ పంట సాగుకు మట్టి అనుకూలమో చెప్పే భూసార పరీక్షలు ప్రహసనాన్ని తలపిస్తున్నాయి తప్పితే రైతులకు జరిగే మేలు శూన్యంగా కనబడుతోంది.
- రాయితీ విత్తనాలు, ఎరువుల నిల్వలపై ఇప్పటికీ వ్యవసాయశాఖ దగ్గర ఓ నిర్దిష్ట ప్రణాళిక లేదు.
- కాల్వల మరమ్మతుల పనులు ప్రారంభమైనా నిర్దిష్ట గడువు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- సీసీఆర్‌సీ కార్డులు, సేద్యానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేదు.

దీపం-2 నగదేది?

- రెండు నెలలైనా అందని సొమ్ము
- ఇప్పటికే పూర్తయిన లక్షలాది బుకింగ్స్
- నగదు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- తొలివిడతలో వెంటనే.. జాడలేని రెండోవిడత

గుంటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో దీపం-2 పథకం రెండో విడత నగదు రెండు నెలలుగా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా రెండో విడతలోనే పిల్లిమొగ్గలు వేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తొలివిడత ఉచిత సిలిండర్ కింద లబ్ధిదారులకు బుక్ చేసుకున్న వెంటనే అందిన నగదు రెండో విడతలో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత నవంబరులో దీపం- 2 పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకూ స్కీమును అమలు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో ఒక్కొక్కరికి రూ.835 చొప్పున రూ.116 కోట్లు చెల్లించింది. తొలివిడత గ్యాస్ సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాలో నగదు పడింది.

● ఈ ఏడాది తొలి సిలిండర్ డబ్బులేవి?

ఈ ఏడాది తొలి ఉచిత సిలిండర్ పొందేందుకు ఏప్రిల్ 1 నుంచి జూలై నెలాఖరు వరకూ గడువును నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన నిధులు ఇప్పటి వరకూ లబ్ధిదారులకు అందలేదు. తొలివిడత ఉచిత సిలిండర్ పొందిన 14 లక్షల మంది లబ్ధిదారుల్లో సగం మంది ఏప్రిల్, మే నెలల్లోనే బుకింగు చేసుకున్నా చాలామందికి రెండు నెలలైనా

(మిగతా 6లో)



కౌన్సెలింగ్.. కాలయాపన

- గందరగోళంతో ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- కమిషనరేట్ ఆదేశాలతో అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

గుంటూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరుకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కౌన్సెలింగ్ గురువారం స్థానిక భారతీయ విద్యా భవన్‌లో జరిగింది. మొత్తం 59 పోస్టులకు 1:3 నిష్పత్తిలో 200 మంది ఉపాధ్యాయులను బుధవారం కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే సాంకేతిక కారణాల వల్ల కౌన్సెలింగ్‌లో జాప్యం చోటుచేసుకుంది. అసహనానికి గురైన ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. గురువారం కౌన్సెలింగ్ ఉంటుందని రావాలని బుధవారం సాయంత్రం ఉపాధ్యాయులకు సమాచారం పంపారు. ఉదయం 8 గంటలకే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే సాయంత్రం వరకు కూడా కమిషనరేట్ నుంచి పదోన్నతుల కోసం అనుమతి రాలేదు. కౌన్సెలింగ్‌లో జరుగుతున్న కాలయాపన, గందరగోళంతో అసహనానికి గురైన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఆందోళనకు దిగారు. వయోభారం కారణంగా పలువురు ఇబ్బందులు పడుతున్నారని అయినా విద్యాశాఖ స్పందించడం లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అయితే కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఆదేశాలు గురువారం సాయంత్రం ఏడు గంటలకు రాగా అప్పటికప్పుడు కౌన్సెలింగ్ చేపట్టారు. దీంతో గురువారం పొద్దుపోయే వరకు ప్రక్రియ కొనసాగింది.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

454 కాల్వల పనులకు రూ.12.59 కోట్లు

- మరమ్మతులు ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి
- వర్షాలు రాకముందే పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశాలు

కర్లపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 454 కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం రూ.12.59 కోట్లు నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండలంలోని తిమ్మరాజు కాల్వ మరమ్మతులకు రూ.12 లక్షలు విడుదల కాగా కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయన్నారు. వర్షాలు రాకముందే చేపట్టిన పనులను పూర్తి చేయాలని జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పంట కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయకట్టు భూములన్నింటికీ సాగునీరు చేరేలా అధికారులు ప్రణాళికబద్ధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ ఎస్ఈ వెంకటరత్నం, ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న, డీపీవో ప్రభాకర్, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మరాజు కాల్వ పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ఆచార్య నాగార్జునుడితో బౌద్ధం పునరుజ్జీవం

యాజలిలో విగ్రహావిష్కరణలో కలెక్టర్ వెంకటమురళి

కర్లపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జునుడితో బౌద్ధ ధర్మం, సంస్కృతి పునరుజ్జీవం చెందాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆచార్య నాగార్జునుడి జన్మస్థలమైన కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ఫోరంఫర్ బెటర్ బాపట్ల సంస్థ ఏర్పాటు చేసిన నాగార్జునుడి విగ్రహాన్ని గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగార్జునుడు 2000 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో జన్మించారని చరిత్రను గుర్తు చేశారు. దేశంలో రెండో బుద్ధుడిగా నాగార్జునుడు ప్రాచుర్యం పొందారన్నారు. ప్రపంచ తత్వవేత్తగా ఎదిగా సమాజానికి మార్గాన్ని నిర్దేశించారన్నారు. స్నుహల్లేఖ, రత్నావళి వంటి కావ్యాలు రాసిన గొప్ప వ్యక్తి నాగార్జునుడన్నారు. నాగార్జునుడి కావ్యాలను శాతవాహన చక్రవర్తి ప్రాచుర్యంలోకి తెచ్చారన్నారు. నాగార్జునుడి పేరుతోనే నాగార్జున్ సాగర్ డ్యామ్ నిర్మాణం జరిగిందన్నారు. ఆయన పేరుతోనే ఆచార్య నాగార్జునుడి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న, ఫోరంఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, బీపీవో ప్రభాకరరావు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, ఎంఈవోలు విజయశ్రీ, దేవరకొండ ప్రసాదరావు, సభ్యులు జీవీ గురజాల శ్రీనివాసరావు, కె.నరసింహారావు, కరణం రవీంద్ర, ఇక్కుర్తి శ్రీనివాసరావు, లక్కాకుల వెంకట్రావు, కేశవులు, సూరిబాబు, సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు షేక్. సీమా పాల్గొన్నారు.



నాగార్జునుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

అక్విడెక్ట్ నిర్మాణానికి రూ.29లక్షలు

● కాల్వల మరమ్మతులకు రూ.27.5లక్షలు ● ఎట్టకేలకు పనులు ప్రారంభం

బాపట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలకు సాగు, తాగునీరు సరఫరా చేసే పీటీ ఛానల్ షట్టర్‌లు దీర్ఘకాలంగా దెబ్బతిని పని చేయటంలేదు. దీనిపై ఆయకట్టు రైతులు అనేక సార్లు విజ్ఞప్తులు చేశారు. అయినప్పటికి గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేశారు. జీబీసీ రోడ్డులోని రైల్వేట్రాక్ పక్కనే పీటీ ఛానల్‌కు ఉన్న మూడు షట్టర్‌లలో రెండు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకటి మాత్రమే పని చేస్తున్నది. దెబ్బతిన్న షట్టర్ల దగ్గర ఇసుక బస్తాలు వేసి అదుపు చేస్తూ వచ్చారు. తీరప్రాంత రైతుల విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు జీవో 65 కింద మూడు ముఖ్యమైన పనులకు 56.5లక్షల రూపాయలు మంజూరు చేశారు. వాటిల్లో పీటీ ఛానల్ షట్టర్ల మరమ్మతులకు 6.5లక్షల రూపాయలు కేటాయించారు. అదేవిధంగా కర్లపాలెం మండలం పేరలిపాడు గ్రామంలో డ్రైనేజీపై రూబెన్ కాల్వ అక్విడెక్ట్ నిర్మాణానికి 29లక్షల రూపాయలు మంజూరు చేశారు. గతంలో డ్రైనేజీపై తూములు ఏర్పాటు చేసి పేరలిపాడు, తుమ్మలపల్లి గ్రామాలకు రూబెన్‌ఛానల్ ద్వారా నీటి సరఫరా చేసేవారు. తూములు దెబ్బతిని నీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతుండటంతో ఆ గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అలాగే తిమ్మరాజు కాల్వ-పేరలిబ్రాంచ్, నెంబర్‌వన్ ఛానల్ కాంక్రీట్ పనులకు 21లక్షల రూపాయలు మంజూరు చేశారు. మంజూరైన నిధులతో నీటి సంఘాల ద్వారా పనులు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు.



జీబీసీరోడ్డులో రైల్వేట్రాక్ పక్కనే దెబ్బతిన్న పీటీ ఛానల్ షట్టర్లు

మాయలేడీ

- ఇద్దరితో వివాహం, మరొకరితో సహజీవనం
- ఎస్పీకి రెండో భర్త ఫిర్యాదు.. పోలీసుల గాలింపు

చీరాల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఓ మాయలేడీ.. ఇద్దరితో వివాహం. మరొకరితో సహజీవనం. టీటీడీలో ఉద్యోగాల పేరుతో ముగ్గురు యువకులకు కుచ్చుటోపీ. అటు రెండో భర్త, ఇటు నిరుద్యోగ యువకు లు ఎస్పీని ఆశ్రయించడంతో ఆ మహిళ కోసం పోలీసులు వేట ప్రారంభిం చారు. చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన ఓ మహిళ 15 ఏళ్ల క్రితం పర్చూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఓ దివ్యాంగ ఉద్యోగితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఆరేళ్ల క్రితం పావులూరుకు చెందిన ఓ వ్యక్తితో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చి అతడితో సహజీవనం సాగించింది. ఇటీవల ఆమెకు హైదారాబాద్‌లో ఉండే స్వగ్రామానికి చెందిన ఓ యువకుడితో పరిచయమైంది. టీటీడీ లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతడి నుంచి రూ.5 లక్షలు తీసుకుంది. బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన మరో ఇద్దరి నుంచి అతడు రూ.5.50 లక్షలను ఇప్పించాడు. వీరి మధ్య చనువు పెరగడంతో యువ కుడ్ని ఆమె పెళ్లి చేసుకుంది. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవ డంతో మిగిలిన ఇద్దరు యువకుడిపై ఒత్తిడి పెంచారు. పైగా అదే సమయంలో ఆమె ఫోన్‌లో మరికొందరితో చనువుగా ఉన్న ఫొటోలను చూసి యువకుడు ఆమెతో గొడవపడ్డాడు. దీంతో ఆ మాయలేడీ బండారం బహిర్గతమైంది.





సభలో అమ్మాయిల ఉత్సాహం




మహానాడు వేదిక



సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





విద్యాకిట్లు వచ్చేశాయ్

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 6.70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉచితంగా విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపశమనం

ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు సెమిస్టర్ల విధానం అమలు కానున్నది. పుస్తకాలు ఇచ్చే విధానంలో కూడా మార్పులు చేయనున్నారు. దీంతో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనున్నది. ఒకటి, రెండు తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్ ఒకటి ఇవ్వనున్నారు. మూడు నాలుగు, ఐదు తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి ఒక పుస్తకంగా ఇవ్వనున్నారు. ఆరు ఏడు తరగతులకు తెలుగు ఆంగ్లం హిందీ ఒక పుస్తకంగా, గణితం భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం కలిపి ఒక పుస్తకంగా, సోషల్ స్టడీస్‌లో చరిత్ర, భౌగోళిక శాస్త్రం అర్థశాస్త్రం కలిపి ఒక పుస్తకంగా అందించనున్నారు. పదో తరగతి విద్యార్థులకు కూడా సెమిస్టర్ వారీగా పుస్తకాలు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల పుస్తకాల బరువు భారీగా తగ్గనున్నట్లు ఉపాధ్యాయులు చెప్తున్నారు.

దీపం-2.. నగదేది?

(5వ పేజీ తరువాయి)

నగదు అందలేదు. పల్నాడు జిల్లాలో 2 లక్షల 86వేలకి 88,196 మందికి మాత్రమే ఇప్పటి వరకూ నగదు జమైంది. గుంటూరు జిల్లాలో 3 లక్షల 8 వేల మందిలో లక్షా 45వేల మందికి మాత్రమే నగదు పడింది. బాపట్ల జిల్లాలో 2,20,568 మందిలో అత్యధికమందికి నగదు జమకాలేదు. గ్యాస్ బుకింగులు పూర్తై రెండు నెలలు కావస్తున్నా దీపం- 2 పథకం నిధులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వారంలోపు జమ

గడిచిన రెండు నెలలుగా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు త్వరలోనే నగదు జమ అవుతుంది. నిధులు కూడా అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్లే పంపిణీ ఆగింది. ఈ వారంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుంది.

-చంద్రముని, డీఎస్‌వో(ఎఫ్‌ఏసీ)

ఖరీఫ్‌పై కదలరా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. కానీ ఇందుకు సంబంధించిన సమాచారం ఏదీ కూడా వ్యవసాయశాఖ వద్ద అందుబాటులో లేదు. బాపట్ల జిల్లాలో 700, గుంటూరు జిల్లాలో 1400, పల్నాడులో 1500 విత్తన నమూనాలను సేకరించి పరీక్షలు జరపాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో 25 శాతం లక్ష్యాలను కూడా చేరుకోలేదు. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 60,000 మట్టి నమూనాలు సేకరించి వాటి ఫలితాలను ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు రైతులకు అందించాల్సిన వ్యవసాయశాఖ ఇప్పటి వరకు ఇందులో 30 శాతం లక్ష్యాలను కూడా చేరుకోకపోవడం ఖరీఫ్ సన్నద్ధతపై సదరు శాఖ నిర్లక్ష్యానికి సూచికగా కనబడుతోంది. రాయితీ విత్తనాలకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా వచ్చిన ఇండెట్లు ఎన్ని? నిల్వలు ఎంతనే దానిపై ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ స్పష్టత లేదు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సమృద్ధిగా అందాలంటే కాల్వల మరమ్మతుల పనులు పూర్తి కావడం అత్యంత కీలకం. అయితే ఆశించిన స్థాయిలో పనులు వేగంగా జరగడం లేదని రైతులు చెప్తున్నారు. సాగు పనులు ప్రారంభమైన తర్వాత కాల్వల ద్వారా నీరు రాకపోతే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా అన్నదాతలను చైతన్య పరచాల్సిన బాధ్యత ఆయా విభాగాలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు మూడు జిల్లాల పరిధిలో ఒక్కటంటే ఒక్క అవగాహన సదస్సు కూడా ఈ అంశంపై నిర్వహించిన దాఖాలలు లేవు. ఈ పరిస్థితుల్లో రైతులు తమకు తోచిన పైరునో లేక గతేడాది ధర ఆధారంగానో ఎంచుకుంటే ఏటా నష్టపోయే పరిస్థితులు ఎదురవుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

మహానాడులో ఉమ్మడి జిల్లా నేతల సందడి

పర్చూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : మహానాడులో ఉమ్మడి ప్రకాశం నేతల సందడి నెలకొంది. కడప గడ్డపై ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గురువారం వేదిక వద్ద ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో కలసి కట్టుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావుతో దర్శనమిచ్చారు.

అద్దంకి : కడపలో జరిగిన మహానాడుకు అద్దంకి నియోజకవర్గం నుండి తరలి వచ్చి విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడిపై నమ్మకం, నారా లోకేష్‌పై ఉన్న విశ్వాసం ప్రతి ఒక్క కార్యకర్త ముఖంలో స్పష్టంగా కనిపించిదని రవికుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీకి నిజమైన బలంగా నిలిచి మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మహానాడుకు వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించిన మహానాడు కమిటీలకు మంత్రి రవికుమార్ అభినందనలు తెలిపారు.



ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

లైంగిక వేధింపుల నివారణకు పోష్ చట్టం

సీనియర్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, మే29 (ఆంధ్రజ్యోతి): పని ప్రదే శాలలో మహిళల పట్ల లైంగిక వేధింపులను నివారించడానికి పోష్ చట్టం రూపొందించారని మండల న్యాయాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. స్థానిక కోర్టులో గురువారం పోష్ చట్టంపై న్యాయవాదులు, పారాలీగల్ వలం టీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయాధికారి సంస్థ చైర్మన్ నాగ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పోష్ చట్టంపై మహిళలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. పనిప్రదేశంలో మహిళలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చని, లైంగిక వేధింపులు నివారించ వచ్చన్నారు. ప్రతి సంస్థలోనూ లైంగిక వేధింపుల ఫిర్యాదులను విచారించడానికి, పరిష్కరించడానికి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసి మహిళలకు న్యాయం చేయనున్నట్లు తెలిపారు. మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, కుటీర పరిశ్రమ, కూలిపనిచేసే మహిళలు అందరికి పోష్ చట్టం ద్వారా న్యాయం చేయవచ్చన్నారు. న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్‌లు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హజరైన న్యాయవాదులు, మాట్లాడుతున్న న్యాయాధికారి నాగ వెంకటలక్ష్మి

ప్రమాదంపై వెంకటేష్ దిగ్భ్రాంతి

మేదరమెట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నుండి కొమ్మినేనివారిపాలెం వెళుతున్న చీరాల వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మేదరమెట్ల సమీపంలో ప్రమాదం కనిపించడంతో అక్కడ ఆగి ఘటనా స్థలానికి వచ్చారు. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో ఆయన కూడా అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. గాయపడిన వారిని స్ట్రెచ్చర్స్ పైకి ఎత్తి అంబులెన్స్‌లోకి ఎక్కించి సాయపడ్డారు. ప్రమాదం జరగడానికి కారణాలను ఎస్ఐ మహమ్మద్ రఫీని అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



పోలీసులతో మాట్లాడుతున్న వెంకటేష్

చంద్‌కు వెంకటేష్ పరామర్శ

బల్లికురవ : మండలంలోని వైదన గ్రామానికి చెందిన బలరాం అభిమాని షేక్ చంద్ కొంత కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం అయనను చీరాల వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు పరా మర్శించారు. ఈ సందర్భంగా అయన అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూములను పరిశీలన

పీసీపల్లి, మే 29 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని దివాకరపల్లి గ్రామ సమీపంలో ఏర్పా టుచేయనున్న బయో గ్యాస్ ప్లాంట్ భూము లను జాయింట్ కలెక్ట ర్ ఆర్.గోపాలకృష్ణ గురువా రం పరిశీలించారు. మం డలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 652లో 475.57 ఎకరాల భూమిలో రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు గత నెలలో భూమిపూజ చేశారు. సదరు భూమి ప్రభుత్వానిది కావడంతో కౌలు పద్ధతిలో రిలయన్స్‌కు కేటాయించేందుకు ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ నుంచి ప్రతిపా దనలు కోరుతూ రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు వచ్చాయి. ఈమేర కు జేసీ గోపాలకృష్ణ, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌తో కలిసి సంబంధిత భూమిని పరిశీలించారు. రికార్డులు, సర్వే మ్యాప్‌లు పరిశీలించిన ఆయన సంబంధిత కంపెనీకి కౌలుకు అప్పజెప్పేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరిత గతిన పూర్తిచేసి నివేదించాలని తహశీల్దార్ ఉషను ఆదేశించారు. అనం తరం మండలంలోని మారెళ్ల రేషన్ దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని ఆయన ఆదేశించారు.

సెల్‌ఫోన్‌తో విద్యుత్ సమస్యలకు పరిష్కారం

చినగంజాం, మే.29(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, మోటుపల్లి, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు సెల్‌ఫోను ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని చినగంజాం విద్యుత్‌శాఖ ఏఈఈ పడవలు గణనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలోని సెల్‌ఫోను నంబర్లకు ఫోను చేసి విద్యుత్ అంతరాయం ఉన్నా, విద్యుత్ సమస్యలు ఉన్నా, పరిష్కరించుకోవాలని అన్నారు. సోపిరాల, మున్నంవారిపాలెం, పూలవారిపాలెం, కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి గ్రామాల వారు చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ సెల్ నెంబరు 9490615415, నిరీక్షణగిరి, రుద్రమాంబపురం, మోటుపల్లి, కృష్ణనగర్, అడవీధిపాలెం, జీడిచెట్లపాలెం, కుంకుడుచెట్లపాలెం, సీతారామపురం, ఎస్టీకాలనీ వారు మోటుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సెల్ నెంబరు 9440816871, చినగంజాం, పల్లెపాలెం, కొత్తపాలెం, మూలగానివారిపాలెం, శాంతినగర్, కుక్కలవారిపాలెం, రాజుబంగారుపాలెం, అమీన్‌నగర్ గ్రామాల వారు కొత్తపాలెం విద్యుత్ సబ్‌స్టేన్ సెల్ నెంబరు 8332974002, పెదగంజాం, పల్లెపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం, ఆవులదొడ్డికొత్తపాలెం, కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం, ఏటిమొగ, బుచ్చిగుంట, ఎస్టీకాలనీ గ్రామాల వారు పెదగంజాం సబ్‌స్టేషన్ 9491052216 సెల్ నెంబరును సంప్రదించాలని ఏఈఈ కోరారు.

శిక్షణ ద్వారా గణితంలో మెళకువలు



మాట్లాడుతున్న గణిత అధ్యాపకుడు లెనిన్‌బాబు

పంగులూరు, మే 29(ఆంధ్రజ్యోతి):పాఠశాల విద్యార్థులకు గణితంలో మెళకువలు ఆకలింపు చేసుకునేందుకు వేసవి ప్రత్యేక శిక్షణ దోహద పడుతుందని ప్రముఖ గణిత అధ్యాపకులు లెనిన్‌బాబు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో 7,8,9,10 తరగతుల విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని గురువారం దేనువకొండ ఆదిశేషంరాజు ప్రారంభించారు. శిక్షణకు 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. గణిత సమస్యలను త్వరిగతిన పరిష్కారం చూపిన బాలబాలికలకు లెనిన్‌బాబు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రామాంజనేయులు, చక్రవరం తిరుమలరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సుజాత, చక్రవరం శ్రీనావాసరాజు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

మద్దిపాడు, మే 29(ఆంధ్ర జ్యోతి): క్రీడలతో స్నేహభా వాన్ని పెంపొందించుకోవచ్చ ని తహసీల్దార్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామపురంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఆ యన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కొణిజేటి శివకు మార్, మనీ, చందు, సాయిభరత్, భావన, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు బొకే అందజేస్తున్న నిర్వాహకులు

అవీ..ఇవీ..

రామకూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

● ఇన్సిలేటర్ల సమస్య అంటున్న సిబ్బంది

పంగులూరు, మే 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని రామకూరు గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజులుగా ప్రతి అరగంటకోసారి విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అర గంటకు ఒకసారి విద్యుత్ పోవడం, రావడం కారణంగా ఇంటిలో వినియోగించే ఫ్యాన్‌లు, టీవీలు ఇతర వస్తువులు షార్ట్ సర్క్యూట్‌తో దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. రాత్రివేళ విద్యుత్ అంతరాయం కారణంగా దోమల బెడదతో తల్లడిల్లుతున్నారు. ఇన్సిలేటర్లు పగుల్లిచ్చి బలహీన పడటం, పగుళ్లలోకి వర్షపు నీరు చేరడం వలన విద్యుత్ సరఫరా తరచూ నిలిచి పోతుందని సిబ్బంది చెబుతుండగా, గ్రామంలో సబ్ స్టేషన్ ఉన్నా విద్యుత్ తరచూ నిలిచి పోవడాన్ని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సమస్యను గుర్తించి విద్యుత్ అంతరాయం నిలువరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పందిళ్లపల్లి(చీరాల), మే 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలు తాళలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పందిళ్లపల్లి పంచాయతీ పరిధిలోని మర్రిచెట్లపాలెం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన నల్లమలపు వెంకారెడ్డి(74) కొంతకాలంగా అనారోగ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఇంట్లో గడ్డిమందు తాగి మృతిచెందాడు. ఘటనపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



ప్రయాణికులతో నిండుగా ఉన్న ఇంకొల్లు బస్టాండు

ఇంకొల్లు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు బస్టాండులో గురువారం ప్రయాణీకులు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. కడపలో జరిగిన మహానాడుకు బస్సులు కేటాయించడంతో బస్సులు సక్రమంగా తిరగలేదు. ఒంగోలు-పర్చూరు ఇంకొల్లు మీదగా ఐదారు తిరిగే బస్సు సర్వీస్సు ఒక్కటి కూడా గురువారం తిరగలేదు. చీరాల, అద్దంకి డిపోల బస్సులు ఇంకొల్లు ప్రాంతానికి తిరగాల్సిన బస్సులు నడపలేదు. కేవలం అద్దెబస్సులు మాత్రమే ఒకటిరెండు నడిచాయి. దీంతో ప్రయాణీలు గమ్యస్థానాలకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఉదయం నుండి రాత్రి వరకు ఇంకొల్లు బస్టాండు ఆవరణ ప్రయాణికులతో కిక్కిరిసింది. నాలుగు బస్సులు నడిపే రూట్‌లలో కనీసం ఒక్క బస్సు సర్వీస్సు కూడా నడపలేదని ప్రయాణీకులు వాపోయారు.

రామనగర్‌లో ఎక్సైజ్ అధికారుల దాడులు

రామనగర్(చీరాల), మే 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రామనగర్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈక్రమంలో దేవర ఎలీషా ఇంటిలో 8 లీటర్లు నాటుసారా, 20 కిలోల కరక్కాయి, 250 గ్రాముల సూపర్ ఫాస్పేట్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడులలో మంగళగిరి ఎస్‌టీఎఫ్, బాపట్ల ఈఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ షిఫ్ట్ ఆపరేటర్ మృతి

బల్లికురవ. మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, అపస్మారక స్థితికి చేరిన కొమ్మినేనివారిపాలెం వాసి అయిన షిఫ్ట్ ఆపరేటర్ కీర్తిపాటి బ్రహ్మయ్య (35) బుధవారం రాత్రి వైద్యశాలలో చికిత్స పొందుతు మృతి చెందాడు. రెండురోజుల క్రితం బ్రహ్మయ్య విధులలో ఉండగా ఫిట్స్ రావడంతో వెంటనే 108లో గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ బ్రహ్మయ్య వైద్యచికిత్స పొందుతు మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

బల్లికురవ, మే29(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేయగా, కోర్టు గురువారం రిమాండ్ విధించింది. 2024 అక్టోబరు 4న కొమ్మినేనివారిపాలెం సమీపంలో సబ్‌స్టేషన్ వద్ద ఆస్తుల విషయంలో గొడవల కారణంగా బి.బాలకృష్ణరెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఈ కేసులో నిందితుడుగా ఉన్న నారాయణరెడ్డిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసి గురువారం అద్దంకి కోర్టులో హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కారును ఢీ కొన్న బైకు

మేదరమెట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో ఎదురెదురుగా బైకు- కారు ఢీకొన్నాయి. దీంతో బైకుపై ప్రమాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గురువారం వేకువజామున రెండు గంటల సమయంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు కొరిశపాడు ఫ్లైఓవర్‌పై వెళుతుండగా, ఫ్లైఓవర్‌పై ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైకు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తికి హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాద సమయంలో కారులో ఉన్నవారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.



అంబులెన్స్‌లో వైద్యశాలకు వెళుతున్న క్షతగ్రాతుడు



ప్రమాదకరంగా ఉన్న దగ్గుపాడు వద్ద మలుపు ఇదే, 13వ మైలురాయి వద్ద ఉన్న మలుపు, రోడ్డుమార్జిన్‌లో అదుపుతప్పి బోల్తాపడిన లారీలు(ఫైల్)

మలుపులు సరిచేసేనా..?

● పాతమద్రాసు రోడ్డులో ప్రమాదకర మలుపులు

● దగ్గుబాడు సమీపంలోని వద్ద తరచూ ప్రమాదాలు

ఇంకొల్లు,మే 29,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు - పర్చూరు పాతమద్రాసు రోడ్డులోని ప్రమాదకర మలుపులు వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారాయి. ఇప్పటికే పలువురి ప్రాణాలను తీసిన ఈ మలుపుల సమస్యకు అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంది. ఈ రహదారిని కొత్తగా నిర్మించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.23.88 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈక్రమంలో ఈ మలుపుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకొంటే ప్రమాదాలు నివారించవచ్చు. ఆ దిశగా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

● దగ్గుబాడు ఉన్నత పాఠశాలకు ప్రసన్నసుప్రజ కోల్డ్‌స్టోరేజ్ మధ్యలో 13వ మైలురాయి వద్ద రోడ్డు ఎక్కువ వంపు తిరిగి ఉంది. దగ్గరకు వచ్చే వరకు ఎదురెదురు వాహనాలు కనిపించవు. దీంతో వాహనాలు ఢీకొని గతంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు ఇక్కడ జరిగిన ప్రమాదాలలో సుమారు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపును కొంతమేరకు తగ్గించి సమాంతరంగా రోడ్డు నిర్మిస్తే ఇక్కడ ప్రమాదాలను నియంత్రించవచ్చునని సమీప గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు దీని ఆవశ్యకతను గుర్తించి తగు సూచనలతో సమస్యను పరిష్కారదిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నారు. అదేవిధంగా ఈ దారిలోని పలుమలుపులను కూడా సరిచేయాలని కోరుతున్నారు.

రహదారి ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

● దారిని కాపాడాలంటున్న గోపాలపురం ఎస్‌టీ కాలనీవాసులు

● పరిశీలించిన తహసీల్దార్

అద్దంకి, మే29(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి దారిగా వినియోగిస్తున్న స్థలంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఉన్నాయని ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు వచ్చి చదును చేయడంతో గోపాలపురం గ్రామస్థులు అడ్డుకున్నారు. గోపాలపురం ఎస్టీ కాలనీ పక్కన శింగరకొండకు వెళ్లేందుకు దారిగా వినియోగిస్తున్న స్థలంలో 8 మందికి గతంలో ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చారని ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు వచ్చి చదును చేసి ప్లాట్లు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న గోపాలపురం గ్రామస్థులు హద్దురాళ్లను తొలగించారు. తహసీల్దార్ శ్రీచరణ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీచరణ్ గురువారం పరిశీలించి సర్వే చేసే వరకు ఎవరూ ఆ స్థలంలోకి వెళ్లవద్దని ఆదేశించారు. గతంలో శింగరకొండ తిరునాళ్లకు విద్యుత్ ప్రభలు ఇదే దారి నుంచి వెళ్లేవని, ప్రస్తుతం ఏటా తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీ బస్సులు తాత్కాలిక గ్యారేజ్‌లోకి కూడా ఇదే దారిన వెళ్తున్న విషయాన్ని తహసీల్దార్‌కు వివరించినట్లు తెలిపారు. ఇళ్లపట్టాల్లో పొందు పరిచిన సర్వే నెంబర్ అసలు గోపాలపురం రెవెన్యూ పరిధిలో లేదని తెలిపారు. ఏదో సర్వే నెంబర్‌తో ఇళ్ల పట్టాలు తీసుకొని ఆక్రమించుకునేందుకు వచ్చారని, ఎట్టి పరిస్థితులలో దారిగా ఉంచాలని తహసీల్దార్‌ను కోరినట్లు టీడీపీ నేతలు పేర్కొన్నారు.



గోపాలపురం వద్ద నామ్ రోడ్డు వెంబడి చదును చేసిన స్థలం

ముక్తేశ్వరంలో బీసీ శ్మశానవాటిక అభివృద్ధి

బల్లికురవ. మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలోని బీసీల శ్మశాన వాటికను గ్రామ టీడీపీ కూటమి నేతలు సొంత ఖర్చులతో అభివృద్ధి చేశారు. కొంత కాలంగా తుమ్మచెట్లతో చిట్టడవిని తలపించేలా ఈ శ్మశానం ఉంది. దీనిని అభివృద్ధి పరచాలని కొంతకాలం నుంచి బీసీలు టీడీపీ నేతలను కోరారు. దీంతో గ్రామంలో ఉన్న టీడీపీ నేతలు సొంత ఖర్చులు వెచ్చించి శ్మశానంలో చెట్లను తొలగించి మెరక మట్టిని తోలించారు. ఎంతో కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్య తీరడంతో బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎవరైన చనిపోతే అంత్యక్రియలు నిర్వహించే సమయంలో తీవ్రఇబ్బంది పడ్డామని ఎన్నికల సమయంలో కూడా తాము సమస్యలను టీడీపీ నేతల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శింగంశెట్టి సుబ్బారావు, అడపాల బసవయ్య, నాగిశెట్టి నాగరాజు, అయప్ప చెన్నూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మెరకతోలే పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు



చిట్లచెట్ల తొలగింపు అనంతరం శ్మశానవాటిక

గుండ్లకమ్మలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

● గురుకుల పాఠశాల, కళాశాల ఊట బావికి పొంచి ఉన్న ముప్పు

● ఆవేదన వ్యక్తం చేస్తున్న సమీప పొలాల రైతులు

అద్దంకి, మే29 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను తోడేస్తుండడంతో గుండ్లకమ్మనదిలో లోతైన గోతులు ఏర్పడుతున్నాయి. అద్దంకి సమీపంలో అక్రమ తవ్వకాలను నియంత్రించడంతో ప్రస్తుతం ఇసుకాసురులు గోపాలపురం, నరశింహపురం రెవెన్యూ పరిధిలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ఈ ప్రాంతంలో శింగరకొండ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు నీటిని పంపింగ్ చేసే ఊట బావి ఉంది. దీని సమీపంలో ప్రస్తుతం యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ఊటబావులలోకి ఊట తగ్గి సుమారు వెయ్యి మంది విద్యార్థినులకు నీటికష్టాలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఇదీ చాలదన్నట్లు ఇసుకాసురులు మరింత బరితెగించారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలోని పంటపొలాల సమీపం వరకు తవ్వకాలు చేస్తున్నారు. దీంతో పంట పొలాలు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలతో యథేచ్ఛగా తవ్వ కాలు జరుగుతున్నప్పటికీ, అధికారులు పట్టించుకోకుండా మిన్నకుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టాలని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీచరణ్ ను వివరణ కోరగా పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామన్నారు.



ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, ఊటబావి సమీపంలో ఇసుక ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పోలీసుల అదుపులో డ్రైవర్

ఈపూరుపాలెం(చీరాల), మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవినూతల గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్న ట్రాక్టర్ పట్టుపడింది. అందిన వివరాల ప్రకారం గ్రామంలో అక్రమంగా రవాణా సాగిస్తుండగా ఎస్సై చంద్రశేఖర్ దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

రేపు అద్దంకి మున్సిపల్ సమావేశం

అద్దంకి,మే29(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేది ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ రవీం ద్ర తెలిపారు. మొత్తం 58 అంశాల అజెండా తో సమావేశం జరుగుతుందని తెలిపారు.

రేపు పెన్షన్ల పంపిణీ

అద్దంకి టౌన్, మే 29, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్‌లకు సంబంధించి సామాజిక భద్రతా పెన్షన్‌లను ఈ నెల 31వ తేదినే పంపిణి చేయడం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. జూన్ 1వ తేది ఆదివారం సెలవు దినం కావడంతో ఒ క రోజు ముందుగానే పెన్షన్లు పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. కావున పెన్షన్ పంపిణి సిబ్బంది పెన్షన్ దారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని తెలిపారు.

సెయింట్‌ఆన్స్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు

చీరాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు పొందడం ఆనందదాయకమని కార్యదర్శి వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం అందుకు సంబంధించిన పత్రాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాలకు యూఎస్‌బీఏ గుర్తింపు రావడం హర్షించదగిన అంశమన్నారు. 2028 వరకు ఈ గుర్తింపు అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



అర్హత పత్రాన్ని ప్రదర్శిస్తున్న కళాశాల ప్రతినిధులు

మన గ్రోమోర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఏడీఏ మోహనరావు

పర్చూరు, మే 29, (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ధరలకు అందుబాటులో ఉండే మన గ్రోమోర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఎన్. మోహనరావు అన్నారు. గురువారం పర్చూరులో ఏర్పాటు చేసిన గ్రోమోర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ రాజేష్, సుధాకర్, మరియు సిబ్బంది, స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రోమోర్‌శాఖను ప్రారంభిస్తున్న ఏడీఏ

థియేటర్ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



చీరాల శాంతి థియేటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో

చీరాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : సినిమాహాలు నిర్వాహకులు కచ్చితంగా ఫాం-బీ సంబంధించి రెన్యువల్ తప్పనిసరిగా పాటించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం పట్టణ పరిధిలోని థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా థియేటర్ లైసెన్స్‌తో పాటు, ఆహారపదార్థాల నాణ్యత, మరుగు దొడ్ల పరిశుభ్రత తదితరాలు తనిఖీలు చేశారు. ఆయా థియేటర్లకు సంబంధించిన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు వెంట వీఆర్వోలు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రామకృష్ణాపురం(చీరాల), మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని ఈవోఆర్డీ రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం, దేవాంగపురి, ఈపూరుపాలెం, తోటవారిపాలెం ప్రాంతాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 21 నాటికి మండల పరిధిలోని అన్నిప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సంతమాగులూరులో ప్రాణాయామం చేస్తున్న అధికారులు

పంగులూరు : శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతో దోహదపడతాయని ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యోగాడే నిర్వహించారు. వ్యక్తి జీవితంలో యోగాభాగం కావాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు సుమంత్, రాంబాబు, సునీత, శిరీష, జానీబేగం, కళ్యాణి, మాదవి, సైదావలి, రజని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ తరఫున గురువారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యాధికారి శ్రీనివాసరావు, మోహన్ తదితరులు మండలంలోని అన్ని శాఖలకు చెందిన 41 మంది ఉద్యోగు లతో యోగ చేయించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఏవో పాండురంగస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం కొంతసేపు యోగ చేస్తే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. ప్రభుత్వం యోగాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో అంబడి పూడి ఆయుష్ వైద్యశాల కాంపౌడర్ శేషసాయి పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నుంచి యోగా శిక్షకులకు శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన 150 మంది యోగా శిక్షకులకు రెండుబ్యాచులుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం నుండి ఐదు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు.



పంగులూరు, బల్లికురవలో యోగా చేస్తున్న అధికారులు

సచివాలయ ఉద్యోగులకు యోగ శిక్షణ

సంతమాగులూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యోగా కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈ యోగ ట్రైనర్‌గా ఎంపీడీవో జ్యోతిర్మయి పాల్గొన్నారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమాలను భాగంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ సర్వే ద్వారా యోగాపై ఆసక్తి ఉన్న వారిని రిజిస్ట్రేషన్ చేయుచున్నారన్నారు. అలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న గ్రామస్థులకు జూన్ 2న సోమవారం నుండి సచివాలయాల వద్ద ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు యోగా శిక్షణ మరియు ప్రాక్టీస్ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక


కడపలో జరిగిన మహానాడు వేదికపై మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



ఏడాదికి ఒకసారి..
విరబూసే అందాలు!

పుష్పాలు అంటేనే అందంతో మిళితమై పరిమళ సువాసనలు వెదజల్లుతాయి. ప్రకృతిప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కొన్ని పూలు సంవత్సరం పొడవునా పూస్తుండగా, ఇంకొన్ని మాత్రం ఒకసారి మాత్రమే పూస్తాయి. అలాంటి కోవకు చెందినవే మే పుష్పాలు. బోగోలు మండలం కడనూతల గ్రామంలో బీ.జయకుమార్ మాస్టారు ఇంట్లో బూసిన 'మే' పుష్పాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

ఒకరోజు ముందే
పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల 1వతేదీన అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈనెల 31న అందించనున్నారు. 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 31న ఉదయం 7గంటలకు సచివాలయ సిబ్బందితోపాటు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తారు. 1వ తేదీతోపాటుగా జూన్ 2 తేదీన కూడా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 3,04,827 మంది పెన్షనర్లు ఉండగా, రూ.132.39 కోట్లు పంపిణీ చేయనున్నారు. కాగా, కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లను జూన్ 12వ తేదీన పంపిణీ చేయనున్నారు.

కాకాణిని కస్టడీకి ఇవ్వండి

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు నెల్లూరులోని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజులపాటు కస్టడీకి అనుమతివ్వాలంటూ అభ్యర్థించారు. కేసు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఏ4 కాకాణిని విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కోర్టు విచారణ జరిపి తుది నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కాగా ఇదే సమయంలో కాకాణి తరఫున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా విచారణ జరగాల్సి ఉంది.

యోగాపై అవగాహన పెంచండి

నెల్లూరు (హరనాథపురం) మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాపై పొదుపు సంఘాల సభ్యులందరూ ప్రజలకు అవగాహన కల్పించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బీ లీలారాణి సూచించారు. నెల్లూరు పట్టణ సమాఖ్య భవనంలో గురువారం సమాఖ్య ఈసీ మెంబర్లు, ఆర్పీలతో సమావేశం జరిగింది. పీడీ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చు అనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం లో టీఈ అంకయ్య, సీవో అబ్దుల్ అలీ బేగ్, సురేష్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాధవి పాల్గొన్నారు.


అడవులను పరిశీలిస్తున్న డెహ్రాడూన్ బృందం

వృక్ష సంపద
పెరిగిందా.. తరిగిందా!?

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అటవీ శాఖ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను గురువారం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు ఇంతియాజ్‌సీ, పీ.అధికారి స్థానిక అటవీ సిబ్బందితో కలిసి దుత్తలూరు, నందిపాడు, ఉదయగిరి, ఆర్లపడియ, సీతారామపురం బీట్‌లను పరిశీలించారు. ఆయా బీట్‌లలో ఏ ఏ వృక్ష జాతులు ఉన్నాయి, వాటి ఎదుగుదల ఎలా ఉంది, వృక్షాల పెరుగుదల తగ్గిందా, పెరిగిందా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బృందం వెంట రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్‌బీవోలు ఓంప్రకాష్, చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వింజమూరులో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్


రాపూరు చెక్‌పోస్టు వద్ద జెండా ఊపుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి

తమ్ముళ్ల సంబరం

● భారీగా కడపకు తరలిన టీడీపీ శ్రేణులు


బుచ్చిరెడ్డిపాళెం : టీడీపీ శ్రేణులతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు

కడపలో మహానాడు బహిరంగ సభకు జిల్లా నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పయనమయ్యారు. గురువారం వేకువజాము నుంచే జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణుల కోలాహలం కనిపించింది. బుధవారం రాత్రే మహానాడు నుంచి తమ నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు జన సమీకరణపై దృష్టి సారించారు. అర్ధరాత్రికి ప్రత్యేక వాహనాలు, ఆర్టీసీ బస్సులు కేటాయించిన గ్రామాలకు చేరుకున్నాయి. వేకువ జాము నుంచే పల్లెల్లో తెలుగు పండుగ వాతావరణం కనిపించింది. మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న వాహనాలను ఎమ్మెల్యేలు జెండాలు ఊపి కడపకు సాగనంపారు. వాటి వెంటే ఎమ్మెల్యేలు కడపకు పయనం అయ్యారు. ఐదేళ్ల కష్టాల తరువాత అధికారంలోకి వచ్చిన ఉత్సాహం తెలుగు దేశం కార్యకర్తల్లో కనిపించింది. అధికార దర్పంతో ప్రత్యేక వాహనాలు ఎక్కి కడప బహిరంగ సభకు తరలివెళ్లారు. జిల్లా నుంచి సుమారుగా 60-70 వేల మంది కార్యకర్తలు మహానాడు బహిరంగ సభకు తరలివెళ్లినట్లు అంచనా.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)


ఉదయగిరి నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ శ్రేణులు

సెలవుల్లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పదిహేను రోజులపాటు సెలవుల్లోకి వెళ్లారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం సెలవు కోసం ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఇన్‌చార్జ్ కలెక్టర్ బాధ్యతలను జేసీ కార్తీక్‌కు అప్పగించారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు
ఎదురుచూపులు

- వివరాలు 7లో..

కోవూరులోని వశిష్ట పాఠశాలకు చెందిన రామిశెట్టి సాయికుందనకు టెన్త్‌లో అన్ని సబ్జెక్ట్‌లలో 90కిపైగా మార్కులు వచ్చాయి. ఇంగ్లీష్‌లో మాత్రం 34 మార్కులు రావడంతో 489 మార్కులు వచ్చినా ఆ విద్యార్థిని ఫెయిల్ అయ్యింది. మానసికంగా కుంగిపోయిన ఆమెను ఓదార్చిన తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందితో చర్చించి వెంటనే రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రీకౌంటింగ్‌లో ఈ విద్యార్థిని ఫెయిల్ అయిన ఇంగ్లీష్‌లో 93 మార్కులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో సాయికుందన మొత్తం మార్కులు 548 వచ్చాయి.

జిల్లాలోని మరో విద్యార్థిని జి.మోక్షితకు సాంఘిక శాస్త్రంలో 84 మార్కులు రావాల్సి ఉండగా 21 వేసినందుకు స్పాట్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన మనుబోలు జడ్పీస్కూల్ ఎస్ఏ ఎ.శాంతిని, స్పెషల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ యూపీ స్కూల్ ఎస్‌జీటీ వి.సురేష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఘటనలను ప్రతిసారి జరుగుతున్నా తప్పులను సరిదిద్దే ప్రయత్నాలు మాత్రం జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. సందేహాలతో రీ వెరిఫికేషన్ చేయించుకుంటున్న వారికి పదుల సంఖ్యలోనే మార్కులు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇవన్నీ మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.



మూల్యాంకన లోపాలు..
విద్యార్థులకు శాపాలు

- టెన్త్ జవాబుపత్రాల దిద్దుబాటులో అలసత్వం
- విద్యార్థుల జీవితాలతో ఆటలు
- రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌లో వెలుగులోకి..

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కలిగిన పలువురు విద్యార్థులకు మార్కులు తక్కువ రావడంతో సందేహించి రీవాల్యూయేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులకు పంపిన జవాబు పత్రాలను పరిశీలించగా వాటిలో జవాబులను అసలు మూల్యాంకనం కూడా చేయకుండా వీరు రాసిన జవాబులే తప్పని నిర్ధారిస్తూ రెడ్‌ఇంక్ పెన్‌తో జవాబులను నిలువునా కొట్టివేశారు. మూల్యాంకన విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఇలాంటి ఘటనలకు పాల్పడటం, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం ఏమిటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూల్యాంకన సమయంలో అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాన్ని మూల్యాంకనం చేసిన తరువాత ర్యాండమ్‌గా ఎగ్జామినర్ వాటిని పరిశీలించి ఆయా ప్రశ్నలకు సరైన మార్కులు వేశారా లేదా అన్నది పరిశీలిస్తారు. మూల్యాంకనం జరిగిన ప్రతి జవాబు పత్రాన్ని కూడా స్క్రూట్నైజర్ పరిశీలించి అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రంలో నమోదు చేసిన మార్కులను లెక్కించి నిర్ణీత బాక్సుల్లో ప్రశ్నల వారీగా నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ముగ్గురు బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుల నడుమ సమన్వయంతో జరుగుతుంది.

● బాధ్యులెవరు.. చర్యలేమిటి!?

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నా వీరిపై మాత్రం ఎలాంటి చర్యలు ఉండటం లేదు. జవాబుపత్రాలు సరిగా పరిశీలించకుండా అన్నీ సరిగా ఉన్నా వాటిని తప్పులుగా కొట్టివేయడం, తమకు నచ్చిన వాటికి మార్కులు వేయడం తదితర ఘటనలతో అర్హులైన విద్యార్థులు నష్టపోతున్నారు. ఇలాంటి ఘటనలు కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తుండగా ఎన్నో మరుగున పడిపోతున్నాయి. వెలుగులోకి వచ్చిన తప్పునకు తాము బాధ్యులం కాదంటూ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ

- మిగతా 7లో..


వచ్చే నెల 15 నుంచి
వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లోనైనా
వసతులు కల్పిస్తారా!?

నేడు సమన్వయ కమిటీ సమావేశం

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల కల్పనపై ఆలయ ఆవరణలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆంధ్రాతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు. అయితే, వ్యయప్రయాసలు పడి వచ్చే భక్తులకు వసతుల కల్పనలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. ఈ ఏడాదైనా అన్ని సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

● ఉత్సవాల సమయంలో పూజా సామగ్రి, కొబ్బరికాయ, ఎండుకొబ్బరి, ఇతరత్రా వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. ఫిర్యాదులు అందుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

● ఇక మద్యం విక్రయాలకు అడ్డూ అదుపు లేదు. ఎక్కడపడితే అక్కడ అధిక ధరలకు మద్యం అమ్ముతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల వేళ మద్యం విక్రయాలను నిరోధించాల్సి ఉంది.

● అమ్మవారి లడ్డూ ప్రసాదంలో నాణ్యత తగ్గుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రద్దీ దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించాలి.

● బ్రహ్మోత్సవాల చివరి రెండు రోజుల్లో భక్తుల తాకిడి అధికం. ఆ సమయంలో దొంగతనాలు విపరీతంగా జరుగుతుంటాయి. దీనికి తోడు జూద స్థావరాలు పుట్టగొడుగుల్లా వెలుస్తాయి. వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అమ్మవారి దర్శనానికి వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

'ఇరిగేషన్'లో
బిల్లుల గోల

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో.. అసలే బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం ఎల్‌వోసీ ఇచ్చినా దానిని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఆ బడ్జెట్ మొత్తం తమదేనంటూ ఓ కాంట్రాక్టర్ అంటే.. కాదు.. మాకూ భాగముందని మరో కాంట్రాక్టర్ ఎదురుతిరుగుతున్నారు. పెన్నార్ కెనాల్ సిస్టమ్‌కు ప్రభుత్వం ఇచ్చిన రూ.17.50 కోట్ల ఎల్‌వోసీ (బడ్జెట్ కేటాయింపులు) చుట్టూ వివాదం జరుగుతోంది. ప్రభుత్వం బడ్జెట్ ఇచ్చి పది రోజులు గడిచినా ఇంతవరకూ ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయలేదు. రెండు కీలక వర్కులకు సంబంధించిన కాంట్రాక్టర్ల మధ్య సఖ్యత కుదరక ఈ పంచాయితీ మంత్రుల వద్దకు చేరినట్లు తెలుస్తోంది.

8

భలే భలే
బంగినపల్లి!

ఊపందుకున్న మామిడిపండ్ల మార్కెట్ ● వర్షాలకు ఒక్కసారిగా కోతకు వచ్చిన కాయలు

వర్షం కురిస్తే కుదేలే

బంగాళాఖాతంలో అల్పపీడనం అని వాతావరణ శాఖ ప్రకటన మామిడి రైతుల్లో ఉన్న కొద్దిగొప్పో ఆశ నీరుకార్చేలా ఉంది. ఇప్పటికే పడిన వర్షానికి కాయల నాణ్యత దెబ్బతినడం, చెట్లనే పండిపోవడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంతటితోనైనా వర్షం బెడద లేకుంటే మామిడి ధర పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశతో ఉన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ టన్ను బంగినపల్లి మామిడి రూ.40 వేలు ఉండగా, గతేడాది ఇదే సీజన్‌లో 65వేల వరకు విక్రయించారు.

ఉలవపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : బంగినపల్లి మామిడి ఆరగిద్దామని ఎదురుచూసే ఫలరాజుప్రియుల కోరిక తీరుతోంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు, మధ్య మధ్యలో ఎండ వేడికి బంగినపల్లి త్వరితగతిన పక్వానికి వచ్చింది. ఉలవపాడులోని ఎమ్పీడీవో కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో పండు మామిడి మార్కెట్ మొదలైంది. సహజంగా మే నెల మూడో వారం నుంచి అడపాదడపా ముందస్తు మామిడి కోతకు వస్తే ఆటోల్లో మార్కెట్‌కు తరలించి సాగుదారు వ్యాపారం సాగించేవాడు. అయితే, ఈసారి మాత్రం రోజు మార్చి రోజు వర్షం కురవడం, ఒక్కోరోజు పగలు ఎండ తీవ్రత అధికంగా ఉండటం వెంటనే రాత్రిపూట వర్షం కురవటంతో మామిడి ముందస్తు పంట దశకు చేరింది. దీంతో చెట్టుకు పండిన కాయలు దిగుమతికి వస్తున్నాయి. మార్కెట్‌లో కిలో లెక్కన కాకుండా ట్రేల లెక్కన అమ్మకాలు జరుపుతుంటారు. ఒక్కో ట్రేలో పెద్ద సైజు బంగినపల్లి మామిడి 40 కాయలు వరకు పడతాయి. మధ్యస్థ సైజు కాయలు 50 పట్టే అవకాశం ఉంది. నాణ్యతను బట్టి ఒక్కో ట్రే ధర ప్రస్తుతం రూ.600 నుంచి 800 వరకు విక్రయిస్తున్నారు.


ఇతర ప్రాంతాల నుంచి ఉలవపాడు మార్కెట్‌కు వస్తున్న బేరగాళ్లు

● పక్క జిల్లాల బేరగాళ్లు

తోటల్లో పక్వానికి వచ్చిన బంగినపల్లి మామిడి ఎగుమతికి అవకాశం లేనందున ఉలవపాడు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో ఆటోల్లో మార్కెట్‌కు తరలిస్తుంటారు. మే మూడోవారం మొదలు పండు మామిడి మార్కెట్ సీజన్ మొదలవుతుందని తెలిసిన ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి రోజువారి బేరగాళ్లు ఉలవపాడులో మకాం మారుస్తారు. పగలంతా వ్యాపారం చేయడం రాత్రికి పక్కనే ఉన్న సాయిబాబా మందిరం ప్రాంగణంలో వసతి పొందుతున్నారు. ప్రతిరోజు తెనాలి, బాపట్ల, చీరాల, వేటపాలెం, ఒంగోలు మీదగా ఉలవపాడుకు వచ్చే ప్యాసింజర్ రైలులోనూ మహిళా వ్యాపారులు వచ్చి తమకు కావాల్సిన సరుకును కొనుగోలు చేసి తిరిగి ప్యాసింజర్ రైలులోనే వెళుతుంటారు. సుమారు రెండు నెలలపాటు ఇదేవిధంగా పక్క జిల్లాల బేరగాళ్లు వస్తుంటారు.


ఉలవపాడు ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని మామిడిపండ్ల మార్కెట్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 525

చెత్త ఏరుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): వీధుల్లో, డస్ట్‌బిన్‌ల వెంట చెత్త ఏరుకోవటం, ఇంటింటా తిరిగి పాత చెత్తను సేకరించుకునే వృత్తి చేసేవారికి కేంద్రప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారా వారి వారి కుటుంబస్థితిని మెరుగుపరచాలన్న లక్ష్యంతో నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్) స్కీంను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అలా జీవనం సాగిస్తున్నవారంతా మున్సిపాలిటీలో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. వారందరికీ ఐడెంటిటీ కార్డులు మంజూరుచేస్తామన్నారు. గుర్తింపు కార్డులు పొందిన వారికి కేంద్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రూ. 5 లక్షల వరకు ఆరోగ్యబీమా అమలయ్యేలా చూస్తుందన్నారు. అంతేకాక వారి వృత్తిలో మరింత ఆదాయం పొందేందుకు అవసరమైన రుణ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వివరించారు. 59 ఏళ్ల పైబడిన వారికి ఈ-శ్రామ్ కార్డు ఇచ్చి ప్రతినెలా రూ. 3వేలు పింఛన్ ఇవ్వటంతోపాటు వారి పిల్లలకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేస్తుందన్నారు.

ప్రమాదాలకు నిలయం లింకు రోడ్డులో ప్రయాణం

● రోడ్డుకిరువైపులా అల్లుకున్న ముళ్ల కంపలు ● ఆపై రాత్రిళ్లు అంధకారం



కంపచెట్లతో కుంచించుకుపోయిన రోడ్డు

కావలి రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దపవని, ఉదయగిరి రోడ్లను కలిపే లింక్‌రోడ్డు కంపచెట్లతో, రోడ్డు పక్కన నాటిన చెట్లకొమ్మలతో కుంచించుకుపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని పెద్దపవని రోడ్డు గుండా ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని గ్రామాల నుంచి కావలికి రాకపోకలతో ఆ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. రెండురోడ్లను అనుసంధానం చేసే రోడ్డు కావటంతో పాటు ఒక పక్క ఫారెస్ట్, వీజీ సెంటర్ భూములు, మరో పక్క ఒరవ కాలువ ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో రెండు వాహనాల క్రాసింగ్‌లో ప్రమాదాల బారినపడాల్సి వస్తుంది. అలాటే విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆ మార్గంలో అంధకారం నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు మార్జిన్ లో కంపచెట్లు, చెట్ల కొమ్మలు తొలగించాలని, విద్యుత్ స్తంభాలకు లైట్లు వేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రైతుల ప్రోత్సాహానికి పలు కార్యక్రమాలు



అల్లూరు : మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

అల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాయని, రైతులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాయని జిల్లా వ్యవసాయ రిసోర్స్ సెంటర్ ఏడీఏ మారుతీదేవి, కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విజ్ఞానంతో ఆలోచించి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్. లోకేష్‌బాబు, వ్యవసాయాధికారులు గీతాకుమారి, వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

● **కరేడులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్**

ఉలవపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, అలగాయపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ నిర్వహించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి బీ తిరుమల జ్యోతి తెలిపారు. స్థానిక రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు చేశారు. కందుకూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు, నిర్కా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్, హైదరాబాద్ కోళ్ల పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కణ్ణన్, ఉర్మి స్టార్టప్ కంపెనీ ప్రతినిధి రాకేష్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కందుకూరు వ్య వసాయ సబ్‌డివిజన్ అధికారి అనసూయ, కేవీ కే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రీరంగ, బీటీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : రసాయనాలను పిచికారి చేసే డ్రోన్ ప్రదర్శన



Hall Ticket	: 2518114071	
Name	: RAMISETTY SAI KUNDANA	
Result	: 489 (FAIL)	

10వ తరగతి ఫలితాల కోసం way2news

	SUBJECT	Marks	Result
1	FIRST LANGUAGE	94	P
2	SECOND LANGUAGE	79	P
3	THIRD LANGUAGE	34	F
4	MATHEMATICS	96	P
5	SCIENCE	92	P
6	SOCIAL STUDIES	94	P

రామిశెట్టి సాయికుందనకు తొలుత వచ్చిన మార్కులు



BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2025
REVERIFICATION / RECOUNTING OF MARKS

Roll Number: 2518114071
Subject: 13E_R - English

There is "Change" in your marks from 34 to 93

Posting and totalling of marks Provisions
whether marks are awarded and posted for all correct answers.
the Answers which are not awarded Marks.
no Provision for Re-valuation.

రీవెరిఫికేషన్, కౌంటింగ్ తర్వాత..

విద్యార్థులకు శాపాలు

(5వ పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు వీరికి పలు సంఘాలు అండగా ఉండటం, ఎవరికి వారు లాబీయింగ్‌లు చేసుకోవడం పరిపాటిగా మారింది. గత ఏడాది కూడా జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూల్యాంకనంలో జరుగుతున్న తప్పిదాలు తిరిగి పునరావృతం కాకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు ఎదురుచూపులు



కౌన్సెలింగ్‌కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్లకు షెడ్యూల్ ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించలేక పోయిన విద్యా శాఖ రెండో రోజు కూడా రాత్రి వరకు ప్రారంభించలేకపోయింది. దీంతో గురువారం ఉదయం నుంచే ఎస్ఏ ఉపాధ్యాయులు నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణకు చేరుకోవడంతో కోలాహలంగా మారింది. సీనియారిటీ జాబితా, రోస్టర్ పాయింట్ల కేటాయింపులు కూడా ఆలస్యం కావడం, ఇతర సాంకేతిక కారణాలతో గురువారం రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పలేదు. చివరకు 8 గంటలపైన అధికారులు చేపట్టినా అభ్యంతరాల నడుమ కొనసాగుతుండటంతో ఏ సమయంలో పూర్తవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మాత్రం ఈ ప్రక్రియను సామరస్యంగా పూర్తి చేస్తామని, ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు కల్పించమన్నారు. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 101 మందికి బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు ఇవ్వగా, ప్రస్తుతం జరిగే ఎస్ఏలకు బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు.

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



కావలి : మహానాడుకు తరలుతున్న తెలుగు తమ్ముళ్లు



వలేటివారిపాలెం : కళవళ్ల గ్రామం నుంచి మహానాడుకు వెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



జలదంకి : జమ్మలపాలెం నుంచి మహానాడుకు తరలివెళ్తున్న తెలుగుతమ్ముళ్లు

కావలి,మే29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం నుంచి మహానాడుకు గురువారం భారీగా తెలుగు తమ్ముళ్ల తరలిపోయారు. 78 బస్సులు, 130 కార్లలో నేతలు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. పట్టణం నుంచి వెళ్లే బస్సులు మినీ స్టేడియం నుంచి బయలు దేరాయి. ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు మాత్రం తమ సొంత, అద్దె కార్లలో వెళ్లారు. పట్టణంలో నుంచి బయలు దేరిన బస్సులకు ఆయా వార్డుల ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోగా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి తదితరులు పర్యవేక్షించారు.

● బిట్రగుంట,(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు పంచాయతీల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు కడప మహానాడుకు గురువారం బయలుదేరారు. మండల పార్టీ కన్వీనర్ నాగేశ్వరరావు వాహనాలకు జెండా ఊపగా మహానాడు కదిలారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, విజయ్‌కుమార్, మాధవరావు, వెంకటేశ్వర్లురెడ్డి, రామోహన్‌రెడ్డి, ఎన్.శీనయ్య, సుబ్బారెడ్డి, రంగయ్య, అమ్మద్‌బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దగదర్తి మండలం నుంచి మాలేపాటి సోదరుల ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు గురువారం మహానాడుకు బయలు దేరారు. పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ మాలేపాటి సుబ్బానాయుడు నినాదాలు చేశారు. యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు సారధ్యంలో మైదుకూరు చేరుకున్న మాలేపాటి సోదరులు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళవళ్ల, అంకభూపాలపురం గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం మహానాడుకు తరవెళ్లారు. కడపకు వెళ్లినవారిలో నాయకులు మోదేపల్లి నారాయణ, ప్రగడ శ్రీనివాసులు, ప్రగడ మోహన్‌కుమార్, ప్రగడ నరసింహరావు, మంగి సురేష్, బత్తుల తిరుపతయ్య, ప్రగడ బలరామయ్య తదితరులు ఉన్నారు.



కొండాపురం మండలం నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ నేతలు

● జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 పంచాయతీల నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు మహానాడుకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు బయలుదేరారు. మరికొందరు సొంత వాహనాలలో వెళ్లారు. మహిళలు కూడా ప్రతీ గ్రామం నుంచి వెళ్లారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మహానాడుకు మండలం నుంచి గురువారం బస్సులు, కార్లలో తెలుగు తమ్ముళ్ల తరలి వెళ్లారు. ఉదయం 10గంటలకు స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని, అక్కడ నుంచి పెద్ద సంఖ్యలో కడపకు బయలుదేరి వెళ్లారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మహానాడులో కందుకూరు నియోజకవర్గ నేతలు గురువారం సందడి చేశారు. మూడురోజులుగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు ముఖ్యనేతలంతా మహానాడులోనే ఉండగా, గురువారం బహిరంగసభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ఇంటూరి జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులు సందడి చేశారు.

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడుకు కొండాపురం మండలం నుంచి రెండు వేలమందికిపైగా నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు.ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశానుసారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సుమారు 25బస్సులు, 75కిపైగా కార్లలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.



కందుకూరు : మహానాడులో కార్యకర్తలతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు



కలిగిరి నుంచి మహానాడుకు తరలివెళ్తున్న తెలుగు తమ్ముళ్లు



బిట్రగుంట : మహానాడుకు బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు

2 నుంచి ఇంటర్ తరగతులు

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూన్ 2 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఎంబైపీసీ, బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నీట్, ఎంసెట్, లాసెట్, టీచర్‌ట్రైనింగ్ కోర్సులకు అవసరమైన మెటీరియల్ కూడా ఉచితంగా అందచేస్తామన్నారు. తమ కళాశాలలో చేరే విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా ఏటా రూ. 15వేల స్కాలర్‌షిప్‌తో పాటు డొక్కా సీతమ్మ భోజనపథకం ద్వారా మధ్యాహ్నభోజనం అందచేస్తామన్నారు.

మతోన్మాదం నశించాలి : సీపీఎం



గుడ్లూరులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గుడ్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న మతోన్మాదం నశించాలని మండల సీఎంఎం కన్వీనర్ జీ. వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెగిశెట్టి వెంకటేశ్వర్లు, కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, ఎస్.కే ఖాదర్‌బాషా, రామాల శ్రీనివాసుల రెడ్డి, సుంకరి విజయలక్ష్మి, కందులు సుబ్బయ్య పాల్గొన్నారు..

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఏవో సురేష్‌బాబు

కలిగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపాలెం, పెద్దకొండూరు, వెలగపాడు, అనంతపురం క్రాకుటూరు, పోలంపాడు రైతుసేవాకేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి మునునూరు సురేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో పచ్చిరొట్ట విత్తనాల కోసం నగదు చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు గురువారం నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. వెలగపాడు ఆర్ఎస్‌కేలో పలువురు రైతులకు ఏవో పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో వీఏవో వెంకటేశ్వర్లు , రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



జలదంకి, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అప్పుడప్పుడు మంటలు రావడం, పేలుడుశబ్దాలతోపాటు తరచూ తీగలు తెగి కింద పడుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో నివాసాలు ఉండేవారితోపాటుగా ప్రయాణికులు భీతిల్లుతున్నారు. జనావాసాల మధ్య కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి





కావలి : జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు,
బిట్రగుంట : వెంకయ్య చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న సీపీఎం నాయకులు

కావలి,మే29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య వర్ధంతిని గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ జక్కా వెంకయ్య ఎంతో మంది పేదలకు భూములు పంచి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీ, మల్లికార్జున, ఎస్. వెంకయ్య, బీక్రిష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి జక్కా వెంకయ్య

బిట్రగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల ఆశాజ్యోతి జక్కా వెంకయ్య అని మండల సీపీఎం సీనియర్ నేత తుమ్మల వెంకయ్య అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో జక్కావెంకయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ అధ్యక్షుడు చల్లా నరహరి, కామ్రేడ్స్ శంకరయ్య, భాస్కర్, ఎస్.రామయ్య, కోటమ్మ, ఎల్లయ్య, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు. దగదర్తి మండలం నారాయణపురంలో జక్కావెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీ.రమేష్, చల్లామాల్యాద్రి, మహేష్, పీ.మాలాద్రి, సుధాకర్, వెంకటరమణ, మధు, రవి సీనయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ



మున్సిపల్ కార్యాలయంలో యోగా ప్రాక్టీసు చేస్తున్న ప్రజలు

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): యోగా డే సన్నాహకాల్లో భాగంగా గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా ప్రాక్టీసు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన 170 మంది యోగా ప్రాక్టీషనర్లతో మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. యోగా డేను కందుకూరులో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఇరువురి ఘర్షణ : ఒకరికి గాయాలు

కావలి రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): పొలం గట్టుపై ఉన్న తాటిచెట్లను ఎక్స్‌కవేటర్‌తో పడేశారని కావలి మండలం కొత్తపల్లిలో గురువారం సాయంత్రం చిమ్మిలి సుబ్బరాయుడు, సోమినేని రామారావుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలోని పొలం మధ్యన ఉన్న గట్టుపై రామారావుకు చెందిన తాటిచెట్లను సుబ్బరాయుడు ఎక్స్‌కవేటర్‌తో తొలగించి రామారావు పొలంలో వేశాడు. ఈ విషయమై సుబ్బరాయుడును రామారావు నిలదీయటంతో ఇరువురు గ్రామంలోని సచివాలయం వద్ద ఘర్షణ పడ్డారు. అనంతరం కొంతసేపటి తరువాత ఇంటికి వెళ్తున్న సుబ్బరాయుడును దారికాచి రామారావు కుమారుడు పట్టుకోగా, రామారావు కత్తితో దాడి చేశాడు. దీంతో సుబ్బరాయుడి తల, కాలికి తీవ్ర రక్తగాయాలు కావటంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.



గాయపడిన సుబ్బరాయుడు



ఎడగారు సాగులో యాజమాన్య పద్ధతులు

● శైలజ, వ్యవసాయాధికారిణి

జలదంకి, మే29(ఆంధ్రజ్యోతి): ఎడగారు వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి బీశైలజ పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఆమె తెలిపారు.

ఈ తెలుసుకోండి

? : రెండో పంట వరి సాగుకు అనుకూలమైన రకాలు.

! : కేఎన్ఎం, ఎంటీయూ 1010 రకాల వరివంగడాలు అనుకూలం.

? : నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు ఏమిటీ.

! : నారుమడిని ముందుగా నీటితో నింపి ఉంచాలి. ఇలా రెండుమూడురోజులు ఉంచితే భూమిలో వేడి పోయి విత్తనాలు త్వరగా మొలకెత్తుతాయి. నారుమడి 10రోజుల వయసులో గుళికలు, జింక్, యూరియా పిచికారి చేసుకోవాలి. 22 రోజుల నుంచి 25రోజుల లోపు నాట్లు వేసుకోవాలి.

? : నాట్లు వేసేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

! : నాట్లు వేసేముందు మడులు దుక్కి చేసి కలుపు లేకుండా చేయాలి. మడిలో నీరు సమాంతరంగా ఉండేలా చూసుకుని నాట్లు వేయాలి. నాటులో సాళ్ళు తప్పనిసరిగా తీయాలి.

? : కలుపు నివారణ చర్యలేంటి.

! : నాట్లు వేసిన మూడోరోజు మడిలో పలుచగా నీరు ఉంచి, కలుపు మందు చల్లాలి.కొత్తగా నీరు మడిలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

న్యూస్ బాక్స్


వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

వలేటివారిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లపాలెంలో గురువారం సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు రామాలయం వద్దకు చేరుకొని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



లింగపాలెంలో శ్రామికుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటవారిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీవో దయాసాగర్ పరిశీలించారు. శ్రామికుల సమక్షంలో మస్టర్లను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ శ్రామికుల విషయంలో జాగ్రతలు తీసుకోవాలన్నారు. కూలీ రూ. 307లు వచ్చేలా కొలతలు ప్రకారం పని చేయాలని, అందుకు టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని తెలిపారు.

89 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 437పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 348బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-69, ఆర్‌ఆర్-14, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 89బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.243.53గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి తెలిపారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







మెరైన్ పోలీసులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు

మత్స్య శాఖ అదుపులో చెన్నై మోటరైజ్డ్ బోటు

బిట్రగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చెన్నై మత్స్యకారుల మోటరైజ్డ్ బోటును కావలి మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు గురు వారం అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాలవారు దొంగతనంగా సముద్రంలో చేపలవేట సాగించేందుకు వచ్చారని తెలిపారు. కోస్టల్ మెరైన్ పోలీసుల సహకారంతో మోటరైజ్డ్ బోటును, అందు లోని వేటకు సంబంధించిన మోటార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల ఒకటి నుంచి జూన్14 వరకు రాష్ట్రంలో సముద్ర వేటకు నిషేధం ప్రకటించినా, వేటకు రావ డం చట్టరీత్యా నేరమని అన్నారు. ఉన్నతా ధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతు న్నామన్నారు. అయితే బుధ వారం ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు నిలుపుకున్న చెన్నై మత్స్యకారులను, స్థానిక మత్స్యకార నాయకుడు త్యాగరాజ్, గ్రామస్థులు నిలదీయడంతో ఆటలు సాగవని గ్రహించి, తెల్లవారుజామునే ఐదు గిల్‌నెట్ బోట్లతో ఉడాయించారని తెలిసింది.

- తెల్లవారుజామునే ఉడాయించిన గిల్‌నెట్ బోట్లు

ఇంధన కొరతతో మోటరై జ్‌డ్ బోటు నిలిచి పోయినట్లు తెలిసింది. ఎటువంటి అల్లర్లు జరగకుండా ఇస్కపల్లి మెరైన్ ఎస్ఐ జానకీ రామిరెడ్డి, సిబ్బంది పహారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాసులు, సచివాలయ మత్స్యకార సహాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : వ్యసనాల కోసం డబ్బు ఇవ్వలేదనే కోపంతో తండ్రిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ తాజుద్దీన్ అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరు నగరం బుజబుజ నెల్లూరు చెన్నకేశవ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ అలియాస్ బండా మస్తాన్ కత్తులకు సానబడుతూ జీవించేవాడు. ఇతని కి ఇద్దరు పిల్లలు. మస్తాన్ పక్షవాతానికి గురై బాధపడు తుండేవాడు. అయన కుమారుడు షేక్ తాజుద్దీన్ వ్యసనాలకు బానిసై కుటుంబ సభ్యు లను వేధించేవాడు. ఆ బాధ తట్టుకోలేక అయన భార్య పుట్టింటికి వెళ్లిపో యింది. 2021 జూన్ 4వ తేదీన ఇంట్లో మస్తాన్ ఒక్కడే ఉండగా తాజుద్దీన్ వెళ్లి డబ్బు అడిగాడు. మస్తాన్ ఇవ్వకపోవడంతో కత్తితో అతని మెడ కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. చుట్టు పక్కల వారు వచ్చి చూడగా మస్తాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ నేరంపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడం తో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి ఏపీపీ సుందరయ్య యాదవ్ వాదించారు.

'ఇరిగేషన్'లో బిల్లుల గోల



- కాజ్ వే వర్సెస్ డీఆర్-డీఎం చానల్
- రూ.17.5 కోట్లు ఎల్‌వోసీ ఇచ్చిన ప్రభుత్వం
- రెండు వర్కులకూ కేటాయించిన సీఈ
- ఈ ఎల్‌వోసీ తమదేనంటున్న కాజ్‌వే కాంట్రాక్టర్
- మాకూ వచ్చిందంటున్న డీఆర్-డీఎం కాంట్రాక్టర్
- బిల్లుల అప్‌లోడ్‌కు బ్రేకులు.. మంత్రుల వద్దకు పంచాయితీ

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలోని ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య పెన్నా నదిపై కాజ్ వే నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ.100 కోట్లతో ఈ పనులు జరుగుతుండగా ఇప్పటివరకూ రూ.23 కోట్ల మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారుల ద్వారా తెలుస్తోంది. గత ప్రభుత్వంలో కొంత మేర పనులు చేయగా రూపాయి కూడా కాంట్రాక్టర్‌కు బిల్లు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఈ వర్కును నేరుగా పరిశీలించి పనులు వేగవంతం చేయించారు. దీంతో చేసిన పనులు రూ.23 కోట్లకు చేరడం, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు రాకపోవడంతో పనుల్లో వేగం తగ్గింది. ఈ ప్రాజెక్టుకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూ రు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అలానే కావలి నియోజకవర్గంలోని దగదర్తి వద్ద డీఆర్-డీఎం చానెల్ ఆధునికీకరణ పనులు రూ.25 కోట్లతో జరుగుతు న్నాయి. గత ప్రభుత్వంలో ఈ పను లు మొదలైనప్పటికీ బిల్లుల సమస్యతో చాలా కాలం పాటు పనులు జరగలేదు. అప్ప ట్లో చేసిన పనులకు రూ.6 కోట్ల బిల్లులు తీసుకొని తర్వాత పనులు ఆపేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఈ వర్కుపై సమీక్షించారు. పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవడంతో పనులు మొదలయ్యాయి. గడిచిన ఏడాది కాలంలో డీఆర్-డీఎం చానెల్ పనులు మరో రూ.12 కోట్ల మేర జరిగాయి. అయితే ఇందులోనూ ఒక్క రూపాయి బిల్లు రాలేదు. కాగా, దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా కాజ్‌వే, డీఆర్-డీఎం చానల్ పనుల పురోగతి ఎంతమేర పనుల చేశారన్న వివరాలను సీఈ అడిగినట్టు చెప్పారు. ఈ రెండు వర్కులు ముఖ్యమైనవేనంటూ తాను నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

కేటాయింపులపై వివాదం

కాగా రెండు వారాల క్రితం పెన్నార్ డెల్టా కెనాల్ సిస్టమ్‌కు ప్రస్తుత క్వార్టర్‌కు సంబంధించి రూ.17.50 కోట్ల ఎల్‌వోసీ మంజూరు చేసింది. దీంతో ఈ బడ్జెట్‌ను తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ కాజ్‌వే, డీఆర్-డీఎం చానెల్ వర్కులకు విభజించారు. కాజ్ వే వర్కుకు రూ.11.50 కోట్లు, డీఆర్-డీఎం చానెల్ వర్కుకు రూ.6 కోట్లు కేటాయించి, ఆ మేరకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సరిగ్గా ఇక్కడే అసలు కథ మొదలైంది. ఈ కేటాయింపుల చుట్టూ ఇప్పుడు వివాదం రాజుకుంది. తాము ప్రయత్నిస్తేనే ఎల్‌వోసీ ఇచ్చారని, అది తమ వర్కుకే ఇచ్చారని కాజ్ వే కాంట్రాక్టర్ చెబుతున్నారు. అయితే ఈ ప్రభుత్వంలో తాము పనులు చేశామని, అందుకే బడ్జెట్ ఇచ్చారని డీఆర్-డీఎం చానెల్ కాంట్రాక్టర్ అంటున్నారు. ఈ ఇద్దరు కాం ట్రాక్టర్లు తమకు ఉన్న రాజకీయ బలంతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఒత్తిడిలోకి వెళ్లిన ఇరిగేషన్ అధికారులు పది రోజులుగా ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయలేదు. తాజాగా ఈ వ్యవహారం ఆర్థిక, ఇరిగేషన్ శాఖల మంత్రుల వద్దకు చేరినట్లు ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. పది రోజుల్లోపు బిల్లులు అప్‌లోడ్ చేయకపోతే ఎల్‌వోసీని ప్రభుత్వం వెన క్కు తీసుకునే అవకాశమున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మరి అప్పటిలోపు వివాదం పరిష్కారమై వచ్చిన బడ్జెట్ వెనక్కుపోకుండా ఎవరొకరికైనా బిల్లు దక్కుతుందో లేదో చూడాలి. ఈ వివాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆదేశించినట్లు సమాచారం.

డిజి లక్ష్మి వస్తోంది!



పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు వివిధ రూపాల్లో ఉపాధి పొందేందుకు తోడ్పాటునందిస్తోంది. తాజాగా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్సీ) ఏర్పాటుకు సంకల్పించింది. వీటిద్వారా ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా పథకానికి రూపకల్పన చేసింది. జూన్ 8వ తేదీన రాష్ట్రంలో 'డిజి లక్ష్మి' పథకం ప్రారంభం కానుండగా జిల్లాలో ఆ నెలాఖరుకు గానీ జూలైలోగానీ ఈ పథకం సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

- పొదుపు మహిళల కోసం కొత్త పథకం
- త్వరలో ప్రారంభించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- డిజిటల్ సేవలతో స్వయం ఉపాధి
- విస్తృతంగా సీఎస్సీ సెంటర్ల ఏర్పాటు
- జిల్లాలో 396 కేంద్రాలకు సన్నాహాలు

నెల్లూరు (హరనాథపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిజి లక్ష్మి పథకం త్వరలో అమలులోకి రానుంది. ఈ పథకం కింద డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీ) ఏర్పాటు చేయనున్నారు. కామన్ సర్వీస్ సెంటర్లు డిజిటల్ ఇండియా కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం. ఇవి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు డిజిటల్ సేవలు అందించేందుకు సహాయపడతాయి. జిల్లాలో ఇప్పటికే 396 సెంటర్ల ఏర్పాటుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. మీ సేవ కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలను డిజి లక్ష్మి పథకానికి ఎంపికైన పొదుపు సంఘాల మహిళలు అందించనున్నారు. జూన్ 8వతేదీ నుంచి రాష్ట్రంలో ఈ డిజిటల్ సేవలు అందు బాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 6వతేదీ వరకు జిల్లాలో ఈ సెంటర్ల ఏర్పాటుకు మహిళల ఎంపిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. జూన్ ఆఖరిలోగానీ జూలై మొదటి వారం లోగానీ జిల్లా వ్యాప్తంగా డిజి లక్ష్మి సెంటర్లు ప్రారంభంకానున్నాయి.

ఒక్కో సెంటర్‌లో ముగ్గురు

డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల ఏర్పాటు ద్వారా మహిళల ఆదాయ మార్గాలకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఒక్కొక్క సెంటర్‌లో ముగ్గురు ఉపాధి పొందే వీలుంటుంది. సుమారు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. ఈ సెంటర్ల ఏర్పాటు కోసం పట్టణ ప్రాంతాల్లో స్లం లెవల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఉన్న పొదుపు సంఘం నుంచి డిగ్రీ చదివిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 25 స్వయం సహాయక సంఘాలు ఉంటాయి. వీటిల్లో సుమారు 250 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ నుంచి ఒక మహిళను డిజి లక్ష్మి సేవలకు ఎంపిక చేస్తున్నారు. అలా ఎంపికైన మహిళకు రూ.2లక్షల రుణం ఇస్తారు. దాంతో కంప్యూటర్, దానికి అనుబంధమైన పరికరాలు సమకూర్చుకోవచ్చు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం



జిల్లాలో డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల సేవలను అతి త్వరలో ప్రజ లకు అందుబాటులోకి తీసుకు వస్తాం. ఇప్పటికే 396 మంది డిగ్రీ చేసిన పొదుపు సంఘాల మహిళ లను గుర్తించి వారికి ఈ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నాం. జూన్ 6వతేదీ వరకు దరఖాస్తు, ఎంపిక కార్యక్రమాలు ఉంటా యి. ఆ తర్వాత ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేసేది తెలియజేస్తాం.

- లీలారాణి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

అర్హతలు ఇవి

- పొదుపు మహిళలకు 21 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి.
- పొదుపు సంఘంలో మూడేళ్లు తప్పనిసరిగా పొదుపు చేసి ఉండాలి.
- డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ నైపుణ్యం కలిగి ఉండాలి.

సేవలు ఇలా...

- మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతం అందిస్తున్న అన్నీ సేవలను డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల ద్వారా అందిస్తారు.
- రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, ఓటర్‌కార్డు, జనన, మరణ ధ్రువీకరణల మంజూరు, బ్యాంకు ఖాతా తెరవడం, డబ్బు డిపాజిట్ చేయడం, విత్ డ్రా చేయడం, ఇతర బ్యాకింగ్ సేవలు ఉంటాయి.
- విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ కోర్సుల్లో చేరడానికి నమోదు, ఆరోగ్య బీమా పాలసీలు, వ్యవసాయ సేవలు అందిస్తారు.